ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 17 జూన్ 2025



భారత్.. మహా గొప్పది!



'భారత దేశం మహా గొప్పది. ఇక్కడి సంప్రదాయాలంటే నాకెంతో ఇష్టం.' అంటున్నారు ఇటలీకి చెందిన గివాణ్ని అల్లెగిరిని. దేశంలో పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించడంతోపాటు ఇక్కడి ఆచార సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఆయన సైకిల్‌పై తిరుగుతున్నారు. మే నెల 2వ తేదీన కన్యాకుమారిలో సైకిల్‌పై బయలుదేరిన అల్లెగిరిని సోమవారం కొడవలూరు మండలం గండవరం వద్ద ఆగారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ దేశంలోని 12 జ్యోతిర్లింగాలను, వాటితో ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కన్యాకుమారి నుంచి జమ్మూకాశ్మీర్‌కు సైకిల్ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. తనకు హిందూ ధర్మంపై అపార భక్తి ఉందని, ఇక్కడి సంప్రదాయామన్నా మహా ఇష్టమని చెప్పొకొచ్చారు. ప్రస్తుతం తాను శ్రీశైలం వెళ్లి అక్కడ మల్లికార్జునుడిని దర్శించుకోనున్నట్లు చెప్పారు.

- కొడవలూరు, (ఆంధ్రజ్యోతి)



ఫోన్ చేసిన 15 నిమిషాల్లో

ఘటనా స్థలికి..

- అందుబాటులోకి అత్యాధునిక పెట్రోలింగ్ వాహనాలు
- నెల్లూరు నుంచి తడ వరకు సేవలు

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిన 15 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకునేలా అత్యాధునిక బొలెరో క్యాంపర్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం సాయంత్రం వెంకటాచలం సమీపంలో ఉన్న స్వర్ణ టోల్‌ప్లాజా వద్ద ఈ వాహనాలను ఎన్‌హెచ్‌ఏఐ నెల్లూరు పీడీ కొండయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. జీపీఎస్, కెమెరా వంటి అధునాతన ఫీచర్స్ కలిగిన ఈ వాహనాలు నెల్లూరు నుంచి తడ వరకు సేవలను అందిస్తాయని అన్నారు.

- వివరాలు 8లో..

క్యూసీ ఈఈగా ధనుంజయులు

నెల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ శాఖ క్వాలిటీ కంట్రోల్ నెల్లూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కే ధనుంజయులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కలువాయి సబ్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఇంజనీర్లకు ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చింది. ఆత్మకూరు డీఈఈగా పనిచేస్తున్న అర్ వెంకటేశ్వర్లును ఈఈగా ఒంగోలుకు బదిలీ చేశారు. ఒంగోలులో డీఈఈ ఉన్న ఎం రవి ఉద్యోగోన్నతిపై ఆత్మకూరు ఇరిగేషన్ డివిజన్ ఈఈగా వచ్చారు. టీజీపీ వెంకటగిరి డివిజన్‌లో పనిచేస్తున్న వీ గజేంద్రరెడ్డిని టీజీపీ రెండో డివిజన్ ఈఈగా నియమించారు. అలానే అనంతపురంలో డీఈఈగా పనిచేస్తున్న జీ రాజన్‌బాబును నెల్లూరు నీరు-ప్రగతి ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



విద్యుద్దీప వెలుగుల్లో రామలింగేశ్వరుడి ఆలయం

రామలింగేశ్వరుడి సంబరం

అంకురార్పణతో ఆరంభం

- వైభవంగా బ్రహ్మోత్సవాలు

విడవలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసి ఉన్న కామాక్షీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురారోపణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాలికల్లో సేకరించిన పుట్ట మన్నుపై పాలలో నానబెట్టిన నవధాన్యాలతో అంకురారోపణ కార్యక్రమాన్ని పండితులు వేదమంత్రాలతో జరిపారు. అర్చకులు 9 రోజుల దీక్షా కంకణ ధారణ చేశారు. అర్చకుడు పేరేపి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, యాగశాల శుద్ధి, కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన కొండూరు నాగరాజన్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, గుమస్తా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

కాకాణి బెయిల్ తదుపరి విచారణ రేపు

నెల్లూరు (లీగల్), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేస్తూ న్యాయాధికారి యన్. సరస్వతి సోమవారం ఉత్తర్వు చేశారు. అలాగే కాకాణి, మరికొంత మందిపై టోల్‌గేటు పెట్టి అక్రమంగా వసూలు చేశారన్న కేసులో బెయిల్ విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఉత్తర్వు చేశారు.

రె'వెన్యూ'లో డిజిటలైజ్!

'మీ సమస్య నాకు అర్థమైంది. కానీ నాకు మరో డాక్యుమెంట్ కావాలి!.',

'మీ రికార్డులన్నీ కరెక్టుగానే ఉన్నాయి.. కానీ ఆర్‌హెచ్ కాపీ ఒక్కటి తీసుకురండి!.',

మీరేమో పట్టా అంటున్నారు.. మా రికార్డులు కూడా చూడాలి కదా.. అందుకు సమయం పడుతుంది. ఓ నెల తర్వాత కలవండి!.',


'కలెక్టర్ గారు ఆర్డర్ ఇచ్చారని మీరు చెబుతున్నారు. కానీ మాకు ఇంకా ఆర్డర్ అందలేదు. అందిన తర్వాత మీ సమస్య పరిష్కరిస్తాం!'

- రెవెన్యూ శాఖలో అధికారుల నుంచి ఎక్కువగా వినిపించే మాటలివి.



కలెక్టరేట్‌లో పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

- వినూత్న మార్పులకు కలెక్టర్ శ్రీకారం
- వేగంగా భూ సమస్యలు పరిష్కరించే ఆలోచన
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్న యంత్రాంగం



సమస్యల మీద వచ్చే ప్రజలకు ఒక పట్టాన రెవెన్యూలో పరిష్కారం కాదు. కొందరు నెలల తిరిగితే.. మరికొందరు ఏళ్లతరబడి తిరుగుతూనే ఉంటారు. చిన్న చిన్న సమస్యలకు కూడా కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బందిలో బాధ్యత పెంచడంతోపాటు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా వేగంగా, నిర్దిష్ట సమయంలోపు సమస్య పరిష్కరించే ప్రక్రియకు కలెక్టర్ ఓ ఆనంద్ శ్రీకారం చుట్టారు. అందుకు రాష్ట్రంలోనే తొలిసారి వినూత్న ప్రయోగానికి పూను కున్నారు. రెవెన్యూలో సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కలిగిన ఉద్యోగుల ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ యడ్ల నాగేశ్వరరావు నేతృత్వంలో ఈ బృందం పని చేస్తోంది. ఈయనకు గతంలో ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన అనుభవం కూడా ఉండటం గమనార్హం. గడిచిన రెండు నెలలుగా కలెక్టర్, ఈ ఉద్యోగ బృందం సాఫ్ట్‌వేర్ తయారీ పనిలో నిమగ్నమై ఉంది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ తయారీ పూర్తవగా దానిని వివిధ రకాలుగా పరీక్ష చేస్తున్నారు. ప్రాథమికంగా ఇది సక్సెస్ కావడంతో సీసీఎల్ఏకు కూడా పంపారు. అక్కడి నుంచి కూడా అనుమతులు రావడం విశేషం.

- రికార్డులన్నీ డిజిటలైజేషన్

నూతన సాఫ్ట్‌వేర్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చాలా వరకూ రెవెన్యూ రికార్డులు డిజిటలైజ్ కాలేదు. రోజులు గడిచే కొద్దీ రికార్డులు కూడా చెదలు పట్టి పాడైపోతున్నాయి. అయితే ఇప్పుడు ఈ రికార్డులన్నిటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న ఆర్ఎస్ఆర్, అడంగల్, ఎఫ్ఎంబీ, 10(1), డీ రిజిస్టర్, సీలింగ్ రిజిస్టర్లే కాకుండా రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న ఆర్‌హెచ్, ఈసీలను కూడా స్కానింగ్ చేయిస్తున్నారు. వీటన్నిటినీ నూతన సాఫ్ట్‌వేర్‌లోకి ఎక్కిస్తున్నారు. ఈ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఉన్నత విద్యావంతులైన కొందరు వీఆర్వోలకు కలెక్టరేట్‌లో విధులు కేటాయించి వారి చేత డిజిటలైజేషన్ చేయిస్తున్నారు. జిల్లాలో 750 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటికే 284 గ్రామాలకు సంబంధించిన పూర్తి రికార్డుల డేటాను నూతన సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేశారు. మరో నెల రోజుల్లో మిగిలిన గ్రామాల రికార్డులను కూడా అనుసంధానించనున్నారు. నూతన సాఫ్ట్‌వేర్‌లో సర్వే నంబర్ లేదా ఎఫ్ఎంబీ నంబర్ సెర్చ్ చేస్తే ఆ భూమికి సంబంధించిన రికార్డులన్నీ వచ్చేస్తాయి. దీంతో సమస్య పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అలానే నూతన సాఫ్ట్‌వేర్‌ను రెవెన్యూ సిబ్బంది పై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉంచేలా తయారు చేశారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్ ద్వారానే వెళుతుండడం, రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటుండడం తో సమస్య పరిష్కారంలో ఉద్దేశ్య పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే వెంటనే ఆ వివరాలు పైఅధికారులకు తెలిసిపోయేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. ఈ ప్రక్రియ ఫలితంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేందుకు కూడా ఆస్కారం ఉండదు. మరో నెలలో పూర్తిస్థాయిలో సాఫ్ట్‌వేర్‌ను రెడీ చేసి దానిని ప్రభుత్వం వద్ద ప్రెజెంట్ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

నాటి తప్పులను సవరించలేరా!?

రీసర్వేతో నష్టపోయాం

బండగానిపల్లి రైతుల ఆవేదన

అర్జీలు ఇచ్చినా కానరాని స్పందన



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు(ఫైల్)

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పులను సవరించాలని తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించడంలేదని బాధిత రైతులు వాపోతున్నారు. మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో జరిగిన భూ రీ సర్వేలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో లేనివారు, చనిపోయిన వారి పేర్లను అడంగల్‌లో నమోదు చేశారని బాధిత రైతులు వాపోయారు. అలాగే ఒకరి భూమి మరొకరికి, విస్తీర్ణంలో తేడాలు తదితర తప్పిదాలు చోటుచేసుకొన్నాయన్నారు. వీటిని సవరించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. ఇలాంటి బాధితులెందరో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీలు ఇస్తున్నారు. కానీ పరిష్కారం మాత్రం లభించడం లేదు.

సంక్షేమ పథకాలకు దూరమయ్యాం

రీ సర్వేలో తప్పిదాలను సవరించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. మా ఆధీనంలో ఉన్న భూములకు ఎల్‌పీ సర్వేనెంబర్ వేరే వాళ్ల పేర్లతో నమోదు చేశారు. వేరే వాళ్ల అనుభవంలో ఉన్న భూములకు మా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశారు. నా తల్లి పేరు మీద 4 ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో 19 ఎకరాలు చూపుతుండటంతో సంక్షేమ పథకాలకు కూడా దూరమయ్యాం. ఉన్నతాధికారులు వెంటనే మా సమస్యను పరిష్కరించాలి.

- బేరి జనార్దన్‌రెడ్డి, బండగానిపల్లి



కమ్ముకున్న మేఘం

నెల్లూరు నగరాన్ని సోమవారం సాయంత్రం మబ్బులు కమ్మేశాయి. పగలంతా ఎండ, ఉక్కపోతతో అల్లాడిన జనానికి సాయంత్రం చల్లని గాలులు ఆహ్లాదాన్ని పంచాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా! 8

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు సన్నద్ధం



- 21 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- ఉమ్మడి జిల్లాలో 4 చోట్ల నిర్వహణ
- సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్‌లు

నెల్లూరు (విద్య), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాలిసెట్-2025 ర్యాంకుల ప్రకారం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 21 నుంచి జూలై 3వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు ప్రాసెసింగ్ రుసుము చెల్లించాలి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు పాలిసెట్ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

4 చోట్ల కౌన్సెలింగ్

ఉమ్మడి నెల్లూరుజిల్లాకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల, కావలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ జరగనుంది. ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్నాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది.

ఏ రోజు ఎవరికి?

ర్యాంకులు సాధించిన విద్యార్థులు 4 కళాశాలల్లో ఎక్కడైనా కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చు. 21వతేదీన 1వ ర్యాంకు నుంచి 15వేల ర్యాంకు వరకు, 22న 15,001 నుంచి 32,000 వరకు, 23న 32,001 నుంచి 50,000 వరకు, 24న 50,001 నుంచి 68,000 వరకు, 25న 68,001 నుంచి 86,000 వరకు, 26న 86,001 నుంచి 1,04,000 వరకు, 27న 1,04,001 నుంచి 1,20,000 వరకు, 28న 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకు సర్టిఫికేట్ల పరిశీలన ఉంటుంది. అలాగే విద్యార్థులకు వెబ్ ఆప్షన్‌ల నమోదుకు ఈ నెల 25 నుంచి 30వతేదీ వరకు గడవు ఇచ్చారు. ఈ నెల 25, 26వ తేదీల్లో 1 నుంచి 50వేల ర్యాంకు వరకు, 27, 28వతేదీల్లో 50001 నుంచి 90000 ర్యాంకు వరకు, 29, 30వతేదీల్లో 90001వ ర్యాంకు నుంచి చివర వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జులై 1వతేదీన వెబ్ ఆప్షన్‌లకు మార్పులు చేర్పులు,3న కళాశాలలు, బ్రాంచ్‌ల కేటాయింపు వివరాలను విడుదల చేస్తారు.

అవసరమైన సర్టిఫికెట్లు

పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, 4 నుంచి 10వతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి మా ర్కుల జాబితా, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలను తీసుకుని హాజరు కావాలి. నాన్‌లోకల్, ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు పది సంవత్సరాల తల్లిదండ్రుల నివాస ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలి.

ఫీజు ఇలా..

షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి 30వతేదీ వరకు విద్యార్థులకు ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. జులై 1న అంతకుముందు ఇచ్చిన ఆప్షన్లను మార్చుకోవచ్చు. 3న సీట్ల కేటాయింపులు ఉంటాయి. అలాగే ఓసీ, బీసీ విద్యార్థులు కౌన్సెలింగ్ ఫీజును రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగ విద్యార్థులు ఈనెల 25 నుంచి 28వతేదీ వరకు ధ్రువపత్రాలను ఖచ్చితంగా తీసుకుని విజయవాడలోని బెంజ్‌సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరై పరిశీలన చేసుకోవాల్సి ఉంది.

ఆందోళన చెందొద్దు!

పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా అన్ని ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. ఎవరికైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తాము. అన్ని కేంద్రాల్లోనూ హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశాము.

- డాక్టర్ రామారావు, జిల్లా సమన్వయకర్త

గ్రామోత్సవంలో పేరంటాలు



వెంగమాంబ గ్రామోత్సవం

- నర్రవాడలో వెల్లువెత్తుతున్న భక్తిభావం
- బ్రహ్మోత్సవాలకు పెరుగుతున్న భక్తుల సందడి

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలతో వాహనాలను అలంకరించుకొని అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేయించుకుంటారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, అభిషేకాలు, హోమాలు జరిగాయి. వెంగమాంబ దంపతులను ప్రత్యేక పూలతో అత్యంత వైభవంగా అలంకరించారు. అమ్మవారి గుండంలో భక్తులు కొబ్బరి వేసి తమ భక్తిని చాటుకొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు వివిధ దేవతామూర్తుల ప్రభలను ఆలయ పరిసరాల్లో తీర్చిదిద్దారు. రాత్రి వెంగమాంబ, గురవయ్యనాయుడుల గ్రామోత్సవం జరిగింది. వడ్డిపాళెంలోని వెంగమాంబ పేరంటాలు పుట్టినింటి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవారిపాళెం మీదుగా దేవస్థానం వద్దకు చేరింది. అమ్మవారి వాహనం ఎదుట చేసిన నృత్యాలు అలరించాయి.



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ దంపతులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంగమాంబ పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి నర్రవాడ పురవీధుల్లో గ్రామోత్సవం జరుగుతుంది.

తాత్కాలిక టోల్‌గేట్ నిర్వహణకు వేలం

విడవలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న తాత్కలిక టోల్‌గేట్ నిర్వహణకు సోమవారం పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో సుమారు ఐదుగురు పాటదారులు పాల్గొనగా గ్రామానికి చెందిన నెల్లూరు అంకయ్య రూ.16,500లకు పాడుకున్నారు. ఈ వేలం పాటలో ఈవోపీఆర్డీ మస్తాన్‌ఖాన్, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సుమంత్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9584
వెండి కిలో ధర	రూ. 109300
వెండి ఒక గ్రాము	రూ. 112.30

జనసేన గుర్తింపు కార్డుల పంపిణీ

రాపూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం పొందిన వారికి నాయకుడు రాజేష్ జల్లెల ఆధ్వర్యంలో సోమవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. రాజేష్ మాట్లాడుతూ సభ్యత్వం పొందిన జనసైనికులు ప్రమాదంలో గాయపడితే రూ.50 వేలు, మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు.

యోగాంధ్రకు తరలిన టీడీపీ నాయకులు

సైదాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో సోమవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి మండల టీడీపీ నాయకులు తరలివెళ్లారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ సర్పంచు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి వరిగొండ సురేంద్ర, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పాములూరి శ్రీనివాసులు నాయుడు, కందాటి విజయ్ రాఘవరెడ్డి తదితరులు హాజరయ్యారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

- తహసీల్దారుకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

రాపూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాపూరు వీఆర్‌ఏలు సోమవారం మండల తహసీల్దార్ లక్ష్మీనరసింహానికి వినతి పత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా వీఆర్‌ఏల సమస్యలు ఒక్కటీ తీర్చలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్‌ఏలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుందని తెలిపారు. మన రాష్ట్రంలోనూ దానిని అమలు చేయాలని కోరారు. నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని, విద్యార్హతలున్న వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ల శాతాన్ని 70కు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దుచేసి, అర్హులైన వీఆర్‌ఏలకు అటెండర్ నైట్ వాచ్మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సుధాకర్, పెంచలయ్య, శ్రీనివాసులు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బురాన్‌పూర్ గ్రామంలో సోమవారం కసుమూరు వైద్యాధికారిని డాక్టర్ ప్రవల్లిక ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా మాసోత్సవాలలో భాగంగా 'మలేరియా అంతం మనతోనే' అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ ప్రవల్లిక మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. వాంతులు, చలి, వణుకుతో కూడిన జ్వర లక్షణాలు ఉంటే కచ్చితంగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కులు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయిస్తేనే అన్నదాత సుఖీభవ

మండల వ్యవసాయాధికారుల వెల్లడి

ముత్తుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హత కలిగిన రైతులంతా ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఈనెల 18వతేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి తెలిపారు. మండల వ్యవసాయ కార్యలయంలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ 2025-25కుగాను ముత్తుకూరు మండలంలో 3747 మంది రైతులు అర్హత పొందారన్నారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే అన్నదాత సుఖీభవ లబ్ధి చేకూరుతుందన్నారు. అన్నదాత సుఖీభవ మార్గదర్శకాల ప్రకారం ఒక రైతు కుటుంబానికి ఒకరికి మాత్రమే సంవత్సరానికి రూ.20వేలు మూడు దఫాలుగా పీఎం కిసాన్‌తో కలిపి వ్యవసాయ ఉద్యాన పట్టు పరిశ్రమ పంటల సాగు ఖర్చుల కోసం జమ చేస్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించేవారు, వ్యవసాయ భూములు లేని వారు ఈ పథకానికి అర్హులుకారని తెలిపారు. అర్హత ఉండి ఇంకా తమ పేర్లు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో కనిపించని రైతులకు త్వరలో అవకాశం ఇస్తామన్నారు. తమ వివరాలు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్నట్లయితే అవకాశం కల్పించినప్పుడు లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు.



ముత్తుకూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి

- మనుబోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులు ఈకేవైసీ చేయించుకుంటేనే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 5183మంది రైతులు ఉన్నారన్నారని, వీరిలో 4981మంది రైతులు మాత్రమే ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించారన్నారు. మిగిలిన 202 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. రేపు పథకం అమలైన తరువాత అప్పుడు ఈకేవైసీ అంటే పథకం ఆలస్యం అవుతుందన్నారు. రైతులు త్వరపడి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.
- సైదాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే తప్పనిసరిగా ప్రతీ రైతు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి హైమావతి ఓ ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు చూపించి వేలిముద్ర ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా గ్రామ సభలు నిర్వహించి రైతులకు ఖరీఫ్ సీజన్‌లో వేయాల్సిన పంటలు, ఎరువుల వాడకం, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు.
- వెంకటాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలకు తప్పనిసరిగా ఈకేవైసీ అవసరమని వ్యవసాయ మండల అధికారి హరికరుణాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు అందుతాయన్నా రు. ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు నగదు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

మనుబోలు, జూన్ 16: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో మండలం నుంచి పలు శాఖల అధికారులు బదిలీ అయ్యారు. వారిస్థానంలో ఇతర మండలాల నుంచి వచ్చిన అధికారులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌గా ఈ. రమాదేవి, ఉపతహసీల్దార్‌గా ఉన్న టి. ప్రదీప్, ఆర్‌ఐగా అరుణ్‌బాబు బాధ్యతలు తీసుకున్నారు. అలాగే మండల వ్యవసాయాధికారిగా వెంకటకృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఏఈగా విజయభాస్కర్ కూడా బాధ్యతలు చేపట్టారు.

వీఎస్‌యూలో యోగాంధ్ర

వెంకటాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత హాజరయ్యారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా తీసుకుంటున్న చర్యలు ప్రతి ఒక్కరికి తెలియజేయడం అవసరమన్నారు. ఆరోగ్యంతోపాటు యోగ సాధన ద్వారా శారీరక, మానసిక శాంతి పొందవచ్చన్నారు. అనంతరం యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ చిలుమూరి శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వీ శ్రీనివాస్, డాక్టర్ ఎం సుశీల, యోగ ట్రైనర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న వీఎస్‌యూ వీసీ, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

తోటపల్లిగూడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముంగలదొరువు గ్రామంలో సోమవారం ఆయన తన సతీమణి సోమిరెడ్డి శృతితో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య, విద్యుత్ దీపాలు, మహిళా సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. సోమిరెడ్డి శృతి మాట్లాడుతూ ప్రధానంగా మహిళలు స్వశక్తిపై ఎదిగేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని, సర్వేపల్లి నియోజకవర్గంలో మహిళలకు ఆర్థిక ఉపాధి కల్పిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంచలంచెలుగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తల్లికి వందనం అందించామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఇతర పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిట్టేటి కవిత, స్థానిక నేత పోతన టీడీపీ నేతలు కొణతం రఘుబాబు, చింతా సీతారామయ్య, సుమన్ పాల్గొన్నారు.

హౌసింగ్‌లో అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదుచేస్తాం

మనుబోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హౌసింగ్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని జిల్లా బీజేపీ నాయకులు మిడతల రమేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన మనుబోలు బీజేపీ నాయకులతో కలిసి జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు నిర్మించే కాంట్రాక్టర్లు నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించకుండానే బేస్‌మెంట్ వరకు కట్టి వదిలేశారని, అయితే వాటికి అంతకుపైన నిర్మాణం చేసుకున్నట్లుగా బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. లబ్ధిదారులకు అందాల్సిన సిమెంట్, కమ్మి, ఇసుక అంతా మాయమైపోయిందన్నారు. అసైన్‌మెంట్ భూములను కొనుగోలు చేసి, లేఅవుట్లకు ఇచ్చి సొమ్ములు చేసుకునేదాంట్లో చూపిన శ్రద్ధ అధికారులు నిర్మాణాల్లో చూపలేదని ఆరోపించారు.



రోడ్డు ప్రమాదంలో టీడీపీ మైనార్టీ నేత మృతి

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెన్నాయపాలెం పంచాయతీ మూలంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి పట్టణ ఇస్లాంపేటకు చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష (50) అలియాస్ ఇట్టు సోమవారం మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కావలి మండలం పెద్దపట్టపుపాలెం నుంచి ఆదివారం సాయంత్రం మోటారుబైక్‌పై కావలి వస్తూ మార్గమధ్యంలోని మూలంపేట సమీపంలో అకస్మాత్తుగా రోడ్డుపై అడ్డువచ్చిన గేదెను ఢీకొట్టారు. ఈప్రమాదంలో బైక్ నడుపుతున్న తలారి సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలు కాగా వెనుక వైపు కూర్చుని ఉన్న ఖాదర్‌బాషాకు తీవ్రగాయాలు కావటంతో పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు నారాయణ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య షాహీదా, మోసిన్, ముమీనా ఇద్దరు కుమారైలు ఉన్నారు.



ఖాదర్‌బాషా (ఫైల్)


సీఎం, డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ పీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కావలి అంబేడ్కర్ నగర్ 11వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు ఆత్మకూరి రాజేష్‌ను సోమవారం 1వ పట్టణ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. గత కొంతకాలంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కోణిదల పవన్‌కల్యాణ్‌పై రాజేష్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతున్నాడని పట్టణంలోని 29వ వార్డుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు సిద్దవరపు ప్రకాష్, అలియాస్ జానీ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జమాల్ వలీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ : ముగ్గురికి గాయాలు

మనుబోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుకుదురు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కొలనుకుదురు దళితవాడకు చెందిన కొంతమంది ఆటోలో కొత్త కోడూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా కట్టువపల్లి దాటగానే బద్దెవోలుకు చెందిన ట్రాక్టర్ ఎదురుగా రావడంతో అదుపుతప్పి రెండు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఆటోలో ఆరుమందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. వీరిలో అజ్జం ఉదయ్‌కుమార్, గోను సుబ్రమణ్యం, గోను నరేంద్రలకు గాయాలయ్యాయి. వీరిలో ఉదయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు అక్కడకు చేరుకుని 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమచికిత్స చేసి గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి వెళ్లే రోడ్డు స్థలం ఆక్రమణల తో కుంచించుకుపోవడంతో రాత్రి సమయాల్లో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కొలనుకుదురు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

గంజాయి విక్రేతల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువచ్చి నెల్లూరులో అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నగరంలోని సంతపేట పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ. దశరథరామారావు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం బడకుల్ జిల్లా, గబాడర్ గ్రామానికి చెందిన బపి సాహూ ప్రస్తుతం ముత్తుకూరు బస్టాండు వెనుక ఉంటున్నారు. చంద్రబాబునగర్ బీ బ్లాక్‌కు చెందిన షేక్ మాబాష ప్రస్తుతం సంతపేటలోని కామాక్షినగర్‌లో ఉంటున్నాడు. వీరిద్దరూ కొంతకాలంగా ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తెప్పిస్తున్నారు. అక్కడ కేజీ గంజాయిని రూ.5వేలు నుంచి రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేసి నెల్లూరుకి తీసుకువస్తారు. మన్సూర్‌నగర్‌కు చెందిన షేక్ రఫీకి గంజాయిని కేజీ రూ.20 వేలకు విక్రయిస్తారు. రఫీ ఆ గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు, ఎస్‌ఐ జీ. బాలకృష్ణ తమ సిబ్బందితో కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం అందిన సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వేపచెట్టు వద్ద సాహూ, మాబాషలు గంజాయిని రఫీకు విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి నగదు కోసం గంజాయి విక్రయిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం వద్దు

- బుచ్చిరెడ్డిపాళెంలో స్థానికుల ఆందోళన


బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్‌రోడ్డు అంబేద్కర్ నగర్ 7వ వీధిలో ఓ భవనంపై సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని స్థానికులు సోమవారం అడ్డుకుని ఆందోళనకు దిగారు. తమ ప్రాంతంలో సెల్‌ఫోన్ టవర్ నిర్మించవద్దని మొరపెట్టుకున్నా నిర్వాహకులు రాత్రుల్లో గుట్టుచప్పుడు కాకుండా పనులు చేపట్టడాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఆవార్డు కౌన్సిలర్ ప్రత్యూష ద్వారా ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.



సెల్‌ఫోన్ టవర్ నిర్మాణదారులను నిలదీస్తున్న స్థానికులు

న్యూస్ బాక్స్

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



జాన్ సుందర్‌ని సన్మానిస్తున్న లక్ష్మీపురం గ్రామకాపులు, ఉపాధ్యాయులు

విడవలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపురంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తించి ముదివర్తి పంచాయతీ గిరిజన కాలనీకి బదిలీ అయిన జాన్ సుందర్‌ని సోమవారం లక్ష్మీపురం గ్రామ కాపులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు రాజగోపాల్‌రెడ్డి దంపతుల రాక

పొదలకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆయన సతీమణి సోమిరెడ్డి శృతిరెడ్డి మంగళవారం పొదలకూరు రానున్నారు. పట్టణంలోని వీరాంజనేయ స్వామి జయంతి వేడుకల్లో భాగంగా 13 వారాలపాటు వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నాలుగో వారమైన మంగళవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులు హాజరుకానున్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొంటారు.

ప్రభుత్వ స్థలాల్లో నివాసితులకు న్యాయం చేయాలి

కావలిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 30 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు 150 గజాల స్థలం క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కత్తి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పీ పెంచులయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తిరుపాలు, కృష్ణయ్య, కృష్ణమోహన్, మేడ వెంకటేశ్వర్లు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి నగర పంచాయతీని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీని అభివృద్ధి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం నగర పంచాయతీలోని 20వ వార్డు పరిధిలోని రామచంద్రాపురంలో ఎమ్మెల్యే పర్యటించి మౌలిక వసతులను పరిశీలించి రూ.10లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా ఎమ్మెల్యేని నాయకులు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ప్రజల కనీస అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అధికారులతో చర్చించి ప్రజలకు అందుబాటులో సచివాలయం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. త్వరలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను వివరించడంతో స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, తహసీల్దారు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శ్రీదేవి, మల్లారెడ్డి, టీడీపీ బుచ్చి మండలం రూరల్ అధ్యక్షుడు బెజవాడ జగదీష్, టి మల్లారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, ఎంవీ శేషయ్య, హరికృష్ణ మోర్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి సమస్యలు తెలుపుతున్న మహిళలు

రెవెన్యూ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

- చౌకిచర్ల గ్రామ టీడీపీ కార్యకర్త, రైతు గర్తోటి శీనయ్య

విడవలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తన పొలాన్ని సాగు చేసుకోనివ్వకుండా వేధింపులకు గురిచేస్తున్న రెవెన్యూ అధికారుల నుంచి రక్షణ కల్పించాలని చౌకిచర్ల గ్రామ టీడీపీ కార్యకర్త, రైతు గర్తోటి శీనయ్య కోరారు. గ్రామంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ చౌకిచర్ల చిన్న హరిజన వాడ సమీపంలో ఖాతా నెంబరు 159లో సుమారు 2.50 సెంట్లు భూమి పూర్వీకుల నుంచి సక్రమించిందన్నారు. భూమికి సంబంధించి ఒన్‌బీ, పాస్ పుస్తకాలు ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన రీసర్వేలో కూడా తన భార్య పేరు మీద పొలం ఉన్నట్లు సర్వే అధికారులు పత్రాలను కూడా ఇచ్చారన్నారు. అయితే స్థానిక రెవెన్యూ అధికారులు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద ముడుపులు తీసుకుని పొలంలోకి దిగకుండా తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. ఆ ఇద్దరి వద్ద భూమికి సంబంధించిన ఎటువంటి పత్రాలు లేకపోయినా వారికే వంత పాడుతూ పోలీసులను పంపి కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈవిషయంపై జిల్లా అధికారులు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి రెవెన్యూ అధికారుల నుంచి రక్షణ కల్పించాలని అయన కోరారు.



భూమికి సంబంధించిన పత్రాలను చూపుతున్న గర్తోటి శీనయ్య

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కోవూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైతులందరూ అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ అనిత సూచించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో 2179 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని, మిగతా రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాల్సిందిగా కోరారు. గ్రామాల్లోని రైతులు రైతుసేవాకేంద్రాల్లో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ రజని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ అనిత

అన్ని వసతులతో ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు


బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలోనే అన్ని వసతులతో ప్రయాణికులకు సౌకర్యంగా ఏర్పాటు చేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆర్టీసీ డీఎం మురళికృష్ణ, తదితర అధికారులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో సిమెంట్‌రోడ్ల ఏర్పాటు, మరుగుదొడ్ల ఆధునీకరణ, ప్రయాణికులకు అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటుచేసి ప్రతి ఆర్టీసీ బస్ పగలైనా రాత్రైనా బస్టాండ్‌లోకి పోవడంతోపాటు సిబ్బంది కూడా రాత్రుల్లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరో నాలుగు నెలల్లో బస్టాండ్ ఆధునీకరించాలని ఆదేశించారు. కాగా, నెల్లూరు నుంచి జొన్నవాడ, పెనుబల్లి మీదుగా బుచ్చికి అక్కడి నుంచి నెల్లూరుకు ఒక బస్సు, నాగాయగుంట నుంచి బుచ్చికి మరో బస్సు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, బీజేపీ నాయకులు కోరడంతో స్పందించి ఏర్పాటు చేస్తామన్నారు. వారి వెంట బుచ్చి అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కల్యాణ్ కుమార్, బీజేపీ నాయకులు కార్యదర్శి కాసా శ్రీనివాసులు, వినయ్‌నారాయణ, ఖాదర్‌బాష, లక్ష్మయ్య, మహేష్ నాయుడు, శ్రీనివాసులు, రాఘవరెడ్డి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

పారుదల కాలువల ఆక్రమణలను అడ్డుకోవాలి

కోవూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పారుదల కాలువల ఆక్రమణలను అడ్డుకోవాలని పలువురు టీడీపీ నాయకులు తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్యకు వినతిపత్రం సమర్పించారు. కాలువల ఆక్రమణల వల్ల తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నామన్నారు. ఈసందర్భంగా తహసీల్దారు సుబ్బయ్య మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. తహ సీల్దారుకు వినతిపత్రం సమర్పించిన వారిలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, నాయకులు బాలారవి, గాదిరాజు అశోక్‌కుమార్, లక్ష్మీనరసారెడ్డి, వేగూరు సుబ్బానాయుడు తదితరులున్నారు. అలాగే ప్రజా విజ్ఞప్తుల దినంలో తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ 11 మంది అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు సుబ్బయ్యతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

నేడు పవన పుత్రుడికి విశేష అభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం) : పప్పులవీధిలో వెలసి ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామికి మంగళ వారం ఉదయం 8.30 గంటల నుంచి మామిడి పండ్ల రసంతో విశేష అభిషేకం నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 7గంటలకు మామిడి పండ్లతో సహస్ర నామార్చన, అనంతరం పల్లకీసేవ జరుగుతుందని పేర్కొంది.

ఆర్డీవో కార్యాలయ ఏవోగా నిర్మలానందబాబ



నెల్లూరు(వెంకటేశ్వరపురం) : నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా నిర్మలానందబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఏవోగా ఉన్న అనీల్ బదిలీ కావడంతో కోవూరు తహసీల్దారు నిర్మలానందబాబును ఏవో నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏవోను కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

విజయదశమి నాటికి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు



పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న అధికారులు

నెల్లూరు(సిటీ), జూన్16 (ఆంధ్రజ్యోతి): వచ్చే విజయదశమి నాటికి టిడ్కో గృహాలను లబ్ధిదారులందరికీ అందచేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎస్ఎంసీ కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారుల నుంచి అందుకున్న వినతులపై స్పందించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో బీసీ కేటగిరీల్లోని డబుల్ బెడ్ రూం గృహాలను సిద్ధం చేసి విజయదశమి నాటికి అందచేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయాయని తెలిపారు. వివిధ కారణాల దృష్ట్యా కొన్ని గృహాలు మంజూరు కాలేదని, వాటి కోసం లబ్ధిదారులు చెల్లించిన మొత్తాలను తిరిగి ఇచ్చేస్తామన్నారు. వీధి కుక్కల దాడులు ఎక్కువగా ఉన్నందున, కఠినఆంక్షలు అమలు చేస్తున్నామన్నారు. అనంతరం నగర వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను అరికట్టాలని జనసేన నేత కిషోర్ కమిషనర్‌ను కోరారు. గాంధీబొమ్మ వద్ద చిరుజల్లులకే డ్రైనేజీ నీరు బయటకు వచ్చేస్తున్నదని, వాటిని నివారించాలని విజ్ఞప్తి చేశారు. గుర్రాలమడుగు వద్ద నడిరోడ్డుపై డ్రైనేజీ కాలువకు డోర్లు విరిగిపోయి ప్రమాదకరంగా మారిందన్నారు.కాగా సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు.

దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



మలేరియాపై ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జునైద్ సిద్ధిఖీ, మలేరియా నివారణ అదనపు అధికారి నాగార్జునరావు తెలిపారు. మలేరియా మాసోత్సవాలు సోమవారం నగరంలోని కోటమిట్టలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో దోమల నుంచి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డాక్టర్ సునైద్ సిద్ధిఖీ మాట్లాడుతూ విపరీతమైన చలి, జ్వరం వస్తే అది మలేరియా జ్వరంగా భావించి, వెంటనే దగ్గలోని ఆసుపత్రిలో పరీక్షలు చేయించుని వైద్య చికిత్సలు పొందాలన్నారు. ఇంటి పరిసరాలలో అనవసరమైన నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేను పాటించి, దోమల లార్వా పెరగకుండా చూడాలన్నారు. దోమల కుట్టకుండా దోమ తెరలు వాడాలని, స్తోమత ఉన్నవారు ఇంటిలో మస్కిటో ప్రూపింగ్ నెట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం అధికారులు శాంసన్‌బాబు, రామారావు , కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నెల్లూరు(విద్య), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పాఠశాలల్లో టెన్త్ పూర్తిచేసిన నిరుపేద ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్వర్ణ వేమయ్య వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందచేశారు. ఎంపిక చేసిన 12 మందికి సోమవారం సుంకు చెంగన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో మా జీ ఎమ్మెల్యే స్వర్ణ వేమయ్య కుమారుడు స్వర్ణ గంగాధర్ ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున అందచేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించి, వారు మరింత ఉత్తమంగా చదువులో రాణించేందుకు తమ ట్రస్ట్ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే.అరవింద, ఉపాధ్యాయులు రామ్మోహన్, స్వర్ణ రమేష్‌బాబు, భాస్కరయ్య, డీవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణారెడ్డి

నెల్లూరు (వైద్యం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంరక్షణ చట్టాలపై విద్యార్థినులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని దిలీప్ నర్సింగ్ కళాశాలలో మహిళా సంరక్షణపై చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలకు అత్యవసర సమయాల్లో అభయాస్త్రంగా పనిచేస్తున్న శక్తి యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో యాక్ట్ వంటి కఠిన చట్టాలు అమలు చేస్తామని తెలిపారు. మానవ అక్రమ రవాణా చేసే ముఠాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీహరి, సతీష్, దిలీప్ నర్సింగ్ కళాశాల కార్యదర్శి ప్రభుదాస్, ప్రిన్సిపాల్ వసుంధర, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వీరిని ఆదుకునేదెవరు!?

● ఇలాంటి వారు ఎక్కడ చూసినా కనిపిస్తారు!



చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతంలో చిన్నారులతో చిత్తుకాగితాలు ఏరుకుంటున్న వ్యక్తి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇలాంటి అభాగ్యులు ఎందరో జిల్లాలోనూ, ముఖ్యంగా నెల్లూరు నగరంలోనూ కనిపిస్తుంటారు. చిత్తుకాగితాలు ఏరుకోవడానికి కుటుంబాలకు కుటుంబాలుగా వెళుతుంటారు. మహిళలు ఒక దిక్కుకు వెళ్లగా, మగవారు పిల్లలను తీసుకుని మరో ప్రాంతంలో చిత్తుకాగితాల కోసం సంచరిస్తుంటారు. ఎక్కువగా ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో కుప్పతొట్లవద్ద, చెత్తాచెదారాలు పేరుకున్న చోట్ల, వీధుల వెంట తిరుగుతూ దొరికిన ప్లాస్టిక్ బాటిళ్లు, కాగితాలు, ఇతర వస్తువులను సేకరిస్తున్నారు. వీరికి ఒక ప్రాంతమంటూ లేదు. అన్నీ ప్రాంతాల్లోనూ సంరిస్తుంటారు. చెత్త సేకరించి వచ్చిన ఆదాయంతో పిల్లలు, పెద్దలు కడుపు నింపుకుంటారు. ప్రహరీ గోడలు, ఫుట్ పాత్‌ల వద్ద తలదాచుకుంటున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, అనేక సంక్షేమ శాఖలు జిల్లాలో ఉన్నాయి. ఎని సంస్థలు జిల్లాలో ఉన్నా, ఇలాంటి అభాగ్యులను గుర్తించలేక పోతున్నాయి. ఒకవేళ గుర్తించినా పట్టించు కోవటంలేదనేది సమాచారం. వారికి ఉపాధి మార్గాలు చూపించటంలేదు. ప్రభుత్వం కరెంటు బిల్లు, ఆధార్, పొలాలు, స్థలాలు తదితర పథకాల అములుకు తీసువస్తున్నా, కొందరు పథకాల లబ్ధిని అక్రమంగా పొందుతున్నారనేది సమాచారం నిజంగా ప్రభుత్వ పథకాల లబ్ధికి అర్హులైన ఇలాంటి వారిని గుర్తించి వారికి పథకాల లబ్ధిని చేకూరాల్సి ఉంది. ఐటీడీఏ, ఐసీడీఎస్ వారు కూడా ఇలాంటి వారిని గుర్తించి చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భూములకు పట్టాలిచ్చి ఆదుకోండి : ఆర్డీవోకి రైతుల వినతి

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని పలువురు రైతులు ఆర్డీవో పావనిని వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరులో జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బలహీన వర్గాల వారికి కేటాయించిన అసైన్‌మెంట్, డీకేటీ పట్టా భూములను వ్యక్తిగతంగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న పేద రైతులను, సీజేఎఫ్ఎస్‌లో సభ్యులుగా చేర్చి ప్రభుత్వమే సంస్థను నిర్వహిస్తూ వచ్చిందన్నారు. అలాంటివారికి పట్టాలివ్వాలని వారు కోరారు.

ముందుకు కదలని 108 అంబులెన్స్‌లు

● మరమ్మతులకు గురై మొరాయింపు ● కాలం చెల్లిన వాహనాలెన్నో... ● రోగుల తరలింపులో ఇక్కట్లు ● కొత్తవి ఎప్పుడొస్తాయో?



మరమ్మతులకు గురైన 108 అంబులెన్స్‌లు

నెల్లూరు (వైద్యం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 108 అంబులెన్స్‌లు పూర్తి సామర్థ్యం లేక మొరాయిస్తున్నాయి. వీటిల్లో కొన్ని సకాలంలో గమ్యస్థానం చేరలేక ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని వాహనాలు ఇప్పటికే ఐదులక్షలపైగా కిలోమీటర్లు తిరిగి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఆయా వాహనాలను మరమ్మతులను పంపిస్తున్నారు. ప్రతి రోజూ ఒక 108 అంబులెన్స్ మరమ్మతుల కోసం ఫోర్స్ ఆటో మొబైల్ షాపునకు వెళుతున్నాయి. వీటికి మరమ్మతులు చేసినా మళ్లీ తరచూ రిపేరుకు వస్తున్నాయి. 108 వాహనం జీవిత కాలం 15 ఏళ్ల ఉన్నా అవి తిరిగిన కిలోమీటర్లను బట్టి వాటి సామర్థ్యాన్ని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే వాటిలో చాలా వరకు నిరుపయోగంగా మారినట్లు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ప్రస్తుతానికి వీటి బాధ్యతను చేపడుతున్నా ప్రస్తుతం 108 అంబులెన్స్‌ల మరమ్మతులకే ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తున్నది.

● కొత్తవి ఏవీ ?

కొత్త వాహనాలు త్వరలో వస్తాయని ప్రభుత్వం చెబుతున్నా అవి ఎప్పటికి వస్తాయోనన్న సందిగ్ధత జిల్లాలో నెలకొంది. ప్రతి రోజూ ప్రమాద బాధితులతో పాటు గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్థులను ఎంతో మందిని 108 అంబులెన్స్‌ల ద్వారా ప్రథమ చికిత్స అందించి సకాలంలో ఆసుపత్రులకు బాధితులను తరలిస్తున్నాయి. అయితే 108 అంబులెన్స్‌లు తరచూ మరమ్మతులకు గురికావటం వల్ల రోగులు తరలింపులో ఇబ్బందులు తప్పటం లేదు.

● జిల్లాలో 39 అంబులెన్స్‌లు

జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్‌లు 39 వరకు తిరుగుతున్నాయి. అయితే ఆ వాహనాలలో 94 మంది ఈఎన్‌టీలు, 94 మంది పైలెట్‌లు పనిచేస్తున్నారు. ఒక జిల్లా మేనేజర్‌తో సహ మరో ముగ్గురు కార్యాలయ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే 108 అంబులెన్స్‌ల మొరాయిస్తున్న కారణంగా కొన్ని వాహనాలను ఎక్కడి కక్కడ వదిలేయాల్సి వస్తున్నది. కొత్తగా 190 కొత్త అంబులెన్స్‌లను జిల్లాకు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అవి ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి నెలకొంది. జిల్లాకు ఎన్ని కొత్త అంబులెన్స్‌లు కేటాయిస్తారో నని జిల్లా అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కొత్తగా భవ్య ఏజెన్సీకి 108 అంబులెన్స్‌ల బాధ్యత అప్పగించినట్లు ప్రభుత్వ ప్రకటించినా ఇంకా ఆ ఏజెన్సీ అందుబాటులోకి రాలేదు. ఇదిలా ఉంటే వైద్య ఆరోగ్యశాఖ సర్వీస్ ఇంజనీర్ 108 అంబులెన్స్‌లు మరమ్మతుకు గురయ్యాయని ఇందులో 19 అంబులెన్స్‌లు ఉండగా ఇందులో ఒకటి పూర్తిగా ఖండం అయినట్లు ప్రభుత్వానికి రాత పూర్వకంగా తెలియచేశారు.

కొత్త అంబులెన్స్‌లు రావాల్సి ఉంది

ప్రస్తుతం జిల్లాలో ఉన్న 108 అంబులెన్స్ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.దీంతో రోగుల తరలింపులో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తగా 190 వరకు 108 అంబులెన్స్‌లు రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో జిల్లాకు కేటాయింపులు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నాం. అవి జిల్లాకు వస్తే అత్యవసర రోగులకు మరింతగా సేవలు అందించవచ్చు. త్వరగా వాటిని పంపాలని కోరుతున్నాం.

- పవన్‌కుమార్,
108 అంబులెన్స్ రీజనల్ మేనేజర్

యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి



యోగాసనాలు వేస్తున్న మెడికోలు



యోగాసనాలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు

నెల్లూరు (వైద్యం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ యోగా ద్వారా ఆరోగ్యకకర మైన జీవనశైలిని అలవరచు కోవాలని నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి అన్నారు. నారాయణ వైద్య కళాశాలలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఇందులో వైద్యులు, మెడికోలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వైద్య పద్ధతులను ఆదునిక వైద్యశాస్త్రంలో కలిపి ప్రజలు ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలన్నారు. నారాయణ వైద్య కళాశాల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు యోగాంధ్ర ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వివిధ యోగా నిపుణులు వివిధ యోగాసనాలు, ప్రాణయానం వంటి చేశారు.

● ఆర్టీసీలో...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగాదినోత్సం సందర్భంగా నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు ప్రాంగణంలో సోమవారం అధికారులు, ఉద్యోగులు, కార్మికులు యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొని యోగాపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ జనార్దన్, డిపో మేనేజర్‌లు మురళీకృష్ణ, శివకేశవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● యోగా గేయానికి ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నగర పాలక సంస్థ యోగాపై వివిధ పోటీలు నిర్వహించింది. ఆ పోటీల్లో యోగా పాటల రచన పోటీ కూడా ఉంది. ఈ పోటీలో గూడూరు ప్రభుత్వ గణిత అధ్యాపకుడు, కవి. నటుడు పీర్‌కుమార్ బద్రి, యోగా వలన కలిగే ఆరోగ్య అంశాలు తెలియజేస్తూ గేయం రాశారు. ఆ గేయానికి ప్రథమ బహుమతి లభించింది. అలాగే ఆ గేయం ఆరోగ్య భారత్ ఆన్‌లైన్ పత్రికలో ప్రచురితమై ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

ఘనంగా వీడ్కోలు సన్మానం



ఐపీఆర్ డీడీ సదారావును సన్మానించిన జర్నలిస్టులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార, పౌర సంబంధాలశాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావుకి సోమవారం జర్నలిస్టు భవన్‌లో ఘనంగా వీడ్కోలు సన్మానం జరిగింది. భవన్ ఇన్‌చార్జ్ మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్స్ మీడియా ప్రతినిధులు సదారావును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సదారావు మాట్లాడుతూ జర్నలిస్టులు అందరూ తనకు సంపూర్ణ సహకారం ఇచ్చారని తెలిపారు. అలాగే సదారావును నెల్లూరు పార్లమెంటు టీడీపీ సాంస్కృతిక విభాగం, ఐటీడీసీ అధ్యక్షుడు దోర్నాల హరిబాబు, షేక్.రసూల్‌లు ఘనంగా సత్కరించారు. కళాకారులకి పించన్లు మంజూరు చేయించడంలో సదారావు ఎంతో సహకారం ఇచ్చారని వారు కొనియాడారు.

గంగాభవానీకి కుంకుమార్చన

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో కొలు వై ఉన్న గంగాభవానీ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన జరిగింది. మహిళలు అమ్మవారికి కాయాకర్పూరం, కుంకుమ, పసుపుతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అన్నదానం చేశారు.

67పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 371 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 304 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-48, ఆర్ఆర్-5, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 67బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ. 260.14 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

రేపటి నుంచి చంద్రన్న పార్కుల బాట



మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో 29 పార్కులను రూ. 7 కోట్లతో ఆధునీకరించేందుకు బుధవారం నుంచి చంద్రన్న పార్కుల బాటపట్టనున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్లోని మున్సిపల్ ప్రాంతాల్లో కీలకమైన పార్కులన్నింటిని ఈ నిధులతో ఆధునీకరించనున్నట్లు తెలిపారు. 18, 19, 20 తేదీల్లో పార్కులబాట పేరిట పనులు మొదలు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆ దిశగా ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, కార్యాలయ ఇన్‌చార్జి చక్రవర్ధన్‌రెడ్డి,క్లస్టర్ ఇన్‌చార్జి మదన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ వేగవంతం



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న శరణి

నెల్లూరు(విద్య), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణ కుమార్తె శరణి అన్నారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల ఆధునీకరణ పనులను త్వరగా పూర్తిచేసి, ఈనెల 23న అధికారికంగా ప్రారంభిస్తామన్నారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో సిద్ధమవుతున్న నేపథ్యంలో తొలిరోజే అడ్మిషన్లు పూర్తవడం గర్వకారణంగా ఉందన్నారు. గదుల కెపాసిటీ మేరకే అడ్మిషన్లు చేపడుతున్నామని, పిల్లలకు ఏకాగ్రత కుదిరేలా తరగతి గదులు తీర్చిదిద్దుతున్నామన్నారు. తొలుత నర్సరీ నుంచి 9వతరగతి వరకు, వచ్చే ఏడాది నుంచి ఇంటర్ వరకు అడ్మిషన్లు కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఫర్నిచర్, క్రీడామైదానాలు, క్రీడా పరికరాలు, డిజిటల్ తరగతులను ఆమె పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

లేఅవుట్లలో అక్రమాలు

● వైసీపీ హయంలో అనర్హులకు ఇళ్ల స్థలాలు
● ప్రజా ప్రయోజన స్థలాల ఆక్రమణ
● జోరుగా అమ్మకాలు

అనంత సాగరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పేదలకు ఇళ్ల స్థలాల పేరిట మండలంలోని అనంతసాగరం, సోమశిల గ్రామాల్లో వేసిన లేఅవుట్లలో అక్రమాలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనర్హులకు స్థలాలు, ఇళ్ల కేటాయించారని, ప్రజాప్రయోజనాల కోసం (గుడి, బడి, ఆసుపత్రి, ఇతర అవసరాలు) వదిలిన ఖాళీ స్థలాలను వైసీపీ నాయకులు, వలంటీర్లు పంచుకొని ఆక్రమించుకున్నారనే విమర్శలున్నాయి. అప్పట్లో అధికారులకు ముడుపులిచ్చి ప్రభుత్వ స్థలాలు కాజేసినట్లు ప్రచారం జరుగుతోంది. అనంతసాగరం ఎంపీడీవో కార్యాలయం వెనుక సర్వే నెంబరు 911, 912లో లేఅవుటు వేశారు. 200 మందికి స్థలాలు కేటాయించారు. స్థానిక నాయకులు తమకు కావల్సిన స్థలాలు రిజర్వు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కొక్క నాయకుడు, వలంటీర్లు రెండు నుంచి నాలుగు వరకు స్థలాలను వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరుతో తీసుకున్నట్లు తెలిసింది. స్థలాలు పొందిన వారి జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడినవారు కూడా ఉండటం విశేషం. ఇదిలా ఉండగా పేదల కోసం వేసిన లేఅవుట్లలో కొందరు ఇళ్ల స్థలాలు అమ్మకానికి పెడుతున్నారు. 9 అంకణాల ప్లాట్ రూ.లక్ష నుంచి 4 లక్షల వరకు పలుకుతోంది. ఈ లేఅవుట్లలో అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

తల్లికి వందనం అమలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16(ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం కార్యక్రమం అమలు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లికి వందనం నిదులు విడుదల చేసి విద్యార్థుల తల్లిదండ్రులల కళ్లలో సంతోషం నింపిన విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలని తెలిపారు. లక్షలాది మందికి మంచి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌పై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేయటం సరికాదన్నారు.

22న నాయీబ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన నాయీ బ్రాహ్మణ విద్యారులకు ఈనెల 22న ప్రతిభ పురస్కారాలు అందచేయనున్నట్లు జిల్లా నాయీబ్రాహ్మణ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నవాబుపేట మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న మద్దులూరి వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆరోజు ఉదయం 9.30గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, ఉన్నత ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, నెల్లూరు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి వై.వినయ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణలో రెండు కోర్సులగాను 60 ఖాళీలు ఉన్నాయని, 10వ తరగతి చదివి, 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 24 నుంచి జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 91608 88066, 80089 45840 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనాన్ని అడ్డుకున్న జనసైనికులు

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసిలి గ్రామ సమీప పొలాల్లో నిల్వ ఉంచిన చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని జనసేన పార్టీ నాయకులు సోమవారం అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని, వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్డీవో, డీఎస్పీలను జనసేన నేతలు కోరారు.



కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16(ఆంధ్రజ్యోతి) : ఏపీ దర్శన్‌లో భాగంగా ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు సోమవారం లైసెనింగ్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనందను కలిశారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి కలెక్టర్ వారికి వివరించారు. అనంతరం వారికి ఉదయగిరి ఉడన్ కట్టరీతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జేసీ కే. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఐపీఆర్ అధికారిగా శివశంకర్‌రావు



నెల్లూరు(హరనాథపురం), జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి (ఎఫ్‌ఏసీ)గా ఏ శివశంకర్ రావు నియమితులయ్యారు. ఇక్కడ ఐపీఆర్ డీడీగా పని చేస్తున్న సదారావు విశాఖ పట్నానికి బదిలీ అయ్యారు. శివశంకర్ రావు ప్రస్తుతం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

భద్రత, భరోసాకు పెట్రోలింగ్ వాహనాలు కీలకం

- ఎన్‌హెచ్‌ఏఐ పీడీ కొండయ్య చౌదరి
- బొలెరో క్యాంపర్ వాహనాలకు జెండా ఊపి ప్రారంభం



వెంకటాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ప్రయాణించేవారికి భద్రత, భరోసా కల్పించడంలో హైవే పెట్రోలింగ్ వాహనాల పాత్ర ఎంతో కీలకమని ఎన్‌హెచ్‌ఏఐ నెల్లూరు పీడీ ఎం కొండయ్య చౌదరి తెలిపారు. వెంకటాచలం సమీపంలో ఉన్న స్వర్ణ టోల్ ప్లాజా వద్ద ఎన్‌ఐఎస్ఎస్ సంస్థ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కొత్త బొలెరో క్యాంపర్ వాహనాలకు సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, సాంకేతిక సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయాన్ని కూడా అందిస్తాయన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ, స్వర్ణటోల్ వేతో కలిసి ఎన్‌ఐఎస్ఎస్ సంస్థ మేనేజింగ్ పార్ట్నర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఆ సంస్థ ఛైర్మన్, రిటైర్డ్ అదనపు ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ చౌదరి ఎన్‌హెచ్‌ఏఐ సూచనలతో ఈ వాహనాలను తయారు చేయించారన్నారు. ఈ పెట్రోలింగ్ వాహనాలకు జీపీఎస్, కెమెరా వంటి అధునాతన ఫీచర్స్‌తోపాటు అన్ని హంగులను జోడించారన్నారు. 1033కి ఫోన్ చేసిన 15 నిమిషాల్లోనే ఈ వాహనాలు ఘటనా స్థలాలకు చేరుకుంటాయని, నెల్లూరు నుంచి తడ వరకు సేవలను అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణటోల్ వే అధికారులు హరి పాండురంగ స్వామి, చంద్రశేఖర్‌రావు, నాగరాజు, మనోజ్‌కుమార్, విక్రమ సింహరెడ్డి, ఎన్‌ఐఎస్ఎస్ సంస్థ మేనేజర్ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 70 వినతులు



అర్జీదారుల సమస్యలు వింటున్న మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా వ్యాప్తంగా 70 మంది పాల్గొని వారి సమస్యలను పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు. మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఫిర్యాదుల్లో కొన్ని..

- నెల్లూరుకి చెందిన ఎన్ ధనమ్మ ఇంటి స్థలం కోసం వెతుకుతుండగా 2024లో విటరాగ కంపెనీకు చెందిన లెక్కల ప్రసాదరెడ్డి పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో ఇంటి స్థలం కోసం ఆమె ప్రసాదరెడ్డికి రూ.25 లక్షల అడ్వాన్సు ఇచ్చింది. అయితే అతను ఇచ్చిన అగ్రిమెంటు సరైనది కాదని, మోసపోయామని తెలుసుకొని తన నగదు తిరిగి ఇవ్వాలని ఆమె కోరారు. దీంతో రూ.13 లక్షల నగదు ఇచ్చి, మిగిలిన నగదుకు చెల్లుబాటు కాని చెక్కులు రాసిచ్చాడు. చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో బాలాజీ నగర్ పోలీసులను ఆమె ఆశ్రయించింది. మరో రూ.8 లక్షలు ఇచ్చి ఇక రూపాయి కూడా ఇచ్చేది లేదని, ఎక్కడైనా చెబితే చంపుతామని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని బాధితురాలు వేడుకొంది.
- దగదర్తికి చెందిన ఓ వ్యక్తితో పాటు మరో 23 మంది వద్ద చిత్తూరుకు చెందిన స్వరూప్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.40 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా మోసం చేశాడు. విచారించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.
- కోవూరుకి చెందిన ఓ మహిళ కుమారుడికి సాంకేతిక శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని కోవూరుకు చెందిన రోహిత్ అనే వ్యక్తి రూ.6 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు. తనకు న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.
- ఇందుకూరుపేటకి చెందిన ఓ మహిళ తన భర్త మరణించడంతో ఒంటరిగా ఉంటోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న అదే ప్రాంతానికి చెందిన అల్లాడి శీనయ్య తనను లోబర్చుకోవాలన్న ఆలోచనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని, రక్షణ కల్పించాలని ఆ మహిళ కోరింది.

విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా!

పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీ పాసులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థలు ప్రారంభం అయ్యాయి. పల్లె ప్రాంతాల్లోని విద్యార్థులు దూరంగా ఉన్న విద్యాసంస్థలకు వెళ్లేందుకు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చుభారంగా మారుతుంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాస్‌లు వరంగా మారాయి. 10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇక ఇంటర్, ఆపై చదువుకుంటున్న విద్యార్థులకు రాయతీ పాస్‌లతో తక్కువ ధరకే బస్సుల్లో ప్రయాణించే సౌలభ్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆర్టీసీలో రాయతీ పాస్‌లు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నగదు అందిస్తుంది.

● దరఖాస్తు ఇలా..

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత, రాయతీతో ప్రయాణించే విద్యార్థులు ముందుగా పాస్‌లు పొందాలి. ఆయా బస్టాండ్లలో ఉన్న బస్సు పాస్ కౌంటర్లలో ఈ పాస్‌లు పొందవచ్చు. ఉచిత పాస్‌లు పొందాలనుకునే వారు ఆధార్‌కార్డు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో బస్సు కౌంటర్ల వద్దకు వెళ్లాలి. రాయతీ పాస్‌లకు ఇంటర్ విద్యార్థులు ఆధార్ కార్డు, పదవ తరగతి హాల్ టికెట్, దరఖాస్తుతోపాటు జత చేయాలి. ఆపై తరగతులు చదివే వారు ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి.

రాయితీ పాసుల రుసుము ఇలా.. (రూ.లలో)

దూరం (కి.మీ)	1 నెలకు	3 నెలలు	8 నెలలు	10 నెలలు	12 నెలలు
5	140	400	1080	1350	1620
10	190	555	1480	1850	2220
15	240	705	1880	2350	2820
20	315	930	2480	3100	3720
25	400	1185	3160	3950	4740
30	435	1290	3440	4300	5160

రాయతీ పాస్‌లు పొందాలనుకుంటే వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కి.మీ పరిధి వరకు రాయతీ పాస్‌లను ఆర్టీసీ అధికారులు అందిస్తున్నారు. గతంలో నెలకోసారి విద్యార్థులు తమ పాస్‌లను రెన్యువల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు నెలకు, మూడు నెలలకు, 8 నుంచి 12 నెలల వరకు ఒకేసారి పాస్‌లను పొందవచ్చు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 398 వినతులు

● అర్జీలు స్వీకరించిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సెలవుపై వెళ్లిన కలెక్టర్ ఆనంద్ తిరిగి సోమవారం విధులకు హాజరై పీజీఆర్ఎస్‌లో పాల్గొనడంతో వందలాది మంది ప్రజలు అర్జీలు సమర్పించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. 398 వినతులను అర్జీదారులు సమర్పించారు. వీటిలో 150 అర్జీలు రెవెన్యూశాఖకు సంబంధించినవి కాగా, పోలీసుశాఖకు 52, సర్వేశాఖకు 51, పంచాయతీ రాజ్‌శాఖకు 24, సివిల్ సప్లయిస్‌కు 14 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను కలెక్టర్ పరిశీలించి, సంబంధించి అధికారులను పిలిచి నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

- ఎరుకల కులస్తుల ఆరాధ్యదైవం ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు.
- ఆక్రమించిన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని దుత్తలూరు మండలం సాపంపల్లి- వెంకటంపేటకు చెందిన దియ్యాల పెంచలయ్య కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లికి ప్రభుత్వం మా గ్రామంలో సర్వేనం.303-2లో 3.48 ఎకరాల భూమి ఇచ్చిందన్నారు. అయితే పలుకుబడి కలిగిన వ్యక్తులు అడంగల్‌లో చల్లా రమణమ్మ అని రాయించుకున్నారన్నారు. ఈ భూమి వాస్తవంగా దియ్యాల వేమక్కకు చెందిన భూమిగా పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

● తల్లికి వందనం అమలు చేయాలి

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్‌కు సీఐటీయూ నేతలు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండాప్రసాద్, సూర్యనారాయణ, శివాజీ, ఆర్ శ్రీనివాసులు, అశోక్, వజ్రమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

సంక్షేమ కార్యక్రమాలు అందించాలి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి సోమవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారి స్పందనను సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకోవాలన్నారు. వ్యతిరేక స్పందన వస్తే అధికారులు విశ్లేషణ చేయాలని సూచించారు.

ఉపకార వేతనాలకు వివరాలు నమోదు చేసుకోండి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16 (ఆం ధ్రజ్యోతి) : కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఈ విద్యా సంవత్సరానికి 1 నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఇంజనీరింగ్, డాక్టర్ కోర్సులు చదువుతు న్న బీడీ, సున్నపురాయి, డోలమైట్, మైకా, ఐర న్, ఓర్, మాంగనీస్, సినీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ కాసాని వెంకట భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉపకార వేతనాల కోసం స్కాలర్‌షిప్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పూర్తివివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి

- జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు
- పెంచలకోనలో యోగాసనాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల, అధికారులు

రాపూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెంచలకోన ఆలయ సరిసరాలలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అన్ని శాఖల అధికారుల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేసే ఎన్నో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చని చెప్పారు. ఈ నెల 21న యోగా డే సందర్భంగా జిల్లావ్యాప్తంగా 7వేల ప్రాంతాలను గుర్తించామని, ప్రతిచోటా ప్రజలతో యోగాసనాలు వేయించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ప్రశాంత జీవనశైలి సొంతమవుతుందని అన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని, ఆరోగ్యంగా జీవించడానికి యోగసనాలను నిత్యం ఆచరించాలని పిలుపునిచ్చారు. యోగాపై మరింత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, ఎమ్పీడీవో భవాని, సీఐ సత్య నారాయణ, అన్ని శాఖల అధికారులు, యోగ అభ్యాసకులు, విద్యార్థులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



విద్యార్థుల యోగాసనాలను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్, ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

వివాహిత ఆత్మహత్య కేసులో ఒకరికి రిమాండ్

ఉలవపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధంతో వివాహిత మరణానికి కారణమైన వ్యక్తికి కందుకూరు కోర్టు సోమవారం 14 రోజుల రిమాండ్ విధించింది. ఎస్ఐ అంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం, గమల్లపాలెం గ్రామానికి చెందిన మహిళకు కావలి మండలం అడవిరాజుపాలెంకు చెందిన గోవర్ధన్‌తో వివాహం అయింది. అదే గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌తో సదరు మహిళకు అక్రమ సంబంధం ఏర్పడింది. విషయం తెలిసిన భర్త గోవర్ధన్ ఆమెను వదిలి మూడేళ్లు అవుతుండగా సదరు మహిళ ప్రియుడు విజయ్‌కుమార్‌తోనే సహజీవనం సాగించింది. కాగా, తన కుటుంబ సభ్యులకు విషయం తెలుస్తుందనే కారణంతో ప్రియుడు సదరు మహిళను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తు వచ్చాడు. గత నెల ఏప్రిల్ 17న ఉలవపాడు మండలంలోని ఆత్మకూరు పంచాయతీ కుమ్మరిపాలెంలోని సదరు మహిళ అమ్మమ్మ ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. విజయ్‌కుమార్ ప్రేరేపిత మాటలు, మానసిక వేదనతో అదేనెల 19న బాధిత మహిళ ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, అక్రమ సంబంధంతో మహిళ మృతికి కారణమైన విజయ్‌కుమార్‌ని అరెస్టు చేసి సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అతిసార నివారణకు కృషి

● డీఎంహెచ్‌వో సుజాత



డయేరియాపై పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అతిసార వ్యాధిని పూర్తిగా నివారించేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో సోమవారం స్టాప్ డయేరియా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పిల్లలు అతిసారా వ్యాధికి గురికాకుండా వక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఓఆర్ఎస్ ద్రావణం ఉపయోగించాలని తెలిపార. పిల్లలు అతిసారా వ్యాధికి గురయినప్పుడు సొంత వైద్యం తీసుకోకుండా, దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. జిల్లాలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అతిసారా వ్యాధిపై విస్తృత ప్రచారం చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డెమో కనకరత్నం, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన అందరి బాధ్యత

● వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



యోగాసనాలు వేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత తదితరులు

కావలిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన అందరి బాధ్యత అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కావలి పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు అధ్యక్షతన యోగ్రాంధ్ర కార్యక్రమం జరుగగా ముఖ్య అతిథులుగా వీసీతో పాటు రిజిస్ట్రార్ డాక్టర్ సునీత పాల్గొని యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య అంధ్రప్రదేశ్ సాధన కోసం చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామం చేయాలని, వ్యాయామంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీ శ్రీనివాస్, డాక్టర్ సుశీల, పీడీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విలువైన పంట భూములు వదులుకోలేం

● కలెక్టర్ ఆనంద్‌కు కరేడు రైతుల వినతి



కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇస్తున్న కరేడు రైతులు

ఉలవపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇండోసోలార్, భారత్ పెట్రోలియం పరిశ్రమల స్థాపనకు విలువైన మాగాణి పంట భూమలును వదులుకోలేమని మండలంలోని కరేడు గ్రామానికి చెందిన కొందరు రైతులు జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో కరేడు గ్రామ రైతులు కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు సూచించగా రెండు పంటలు పండే భూములు వదులుకొని జీవించలేమని చెప్పినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మిరియం శ్రీనివాసులు, బత్తుల రమణారెడ్డి, నల్లపరెడ్డి వరదరెడ్డి, అల్పూరి కృష్ణారెడ్డి, దాచూరి వెంకారెడ్డి, గోపిరెడ్డి బ్రహ్మారెడ్డి, వెంకటరెడ్డి, రమణయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నెల్లూరు (క్రైం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయడం ఖాయమని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ నేత నారాయణస్వామి అన్నారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో సోమవారం నారాయణస్వామి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా జైలు బయట ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉంటున్న వైసీపీ నాయకులపై ఎన్ని కేసులు పెట్టాలి, వారిని ఏ విధంగా ఇబ్బందులకు గురి చేయాలన్న ఆలోచనలే తప్ప రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తదితరులు ఉన్నారు.

ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రి



దుర్గం కొండపై గుర్తించిన పేలుడు సామగ్రి

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రిని కొందరు యువకులు గుర్తించినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు.. ఉదయగిరి పట్టణానికి చెందిన కొందరు యువకులు శనివారం రాత్రి పెద్దమసీదు వద్ద నిద్ర చేసేందుకు వెళ్లారు. వారు వెళ్లే సమయానికి కొండపైగల రామ్, కరీంబుగ్గ ప్రాంతంలో దీపాలు వెలుగుతుండటం, కొందరు వ్యక్తులు సంచరిస్తుండటాన్ని గుర్తించారు. ఆ సమయంలో అక్కడికెళ్లేందుకు వారు భయపడ్డారు. రాత్రికి నిద్ర చేసిన తర్వాత ఆదివారం ఉదయం తిరిగి పట్టణానికి వస్తూ రాత్రి దీపాలు వెలుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఓ ప్లాస్టిక్ కవర్‌లో పేలుడు సామగ్రి, భోజనం ప్లేట్లు, ఇతర సామగ్రిని గుర్తించారు. రాత్రి అక్కడ కనిపించినది గుప్తనిధుల తవ్వకాల ముఠానే అని నిర్ధారించుకుని తిరిగి వచ్చేశారు. వారు పట్టణంలో చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఉదయగిరి దుర్గాన్ని రాజులు, నవాబులు పాలించిన విషయం తెలిసిందే. వారి పాలనలో వజ్రవైఢూర్యాలు, బంగారాన్ని దాచి ఉంచారని పలువురి నమ్మకం. అందుకనే తరచూ కొండపై గుప్తనిధుల తవ్వకాలు జరుగుతుంటారు. తాజాగా పేలుడు పదార్థాలు గుర్తించడమూ దానికి నిదర్శనం. కాగా, గతంలో కొండపై గుప్తనిధుల తవ్వకాలు జరిపే సమయంలో పేలుడు సంభవించి ఓ వ్యక్తి మరణించిన విషయం విదితమే.

నేత్రపర్వం అలఘునాథ కల్యాణం

ఆత్మకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో సోమవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9584
వెండి కిలో ధర	రూ. 109300
వెండి ఒక గ్రాము	రూ. 112.30



గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

● నారాయణరావు, గ్రంథపాలకుడు, అనంతసాగరం

అనంతసాగరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనంతసాగరం గ్రంథపాలకుడు నారాయణ రావు పిలుపునిచ్చారు. పిల్లలు తరచూ గ్రంథాలయానికి వచ్చే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఇంకా పలు విషయాలు ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

ఈ అంశంపై

? వేసవి శిక్షణ తరగతులు ఎలా జరిగాయి.

! వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులకు మంచి ప్రోత్సాహం లభించింది. క్రమం తప్పకుండా కొందరు విద్యార్థులు హాజరయ్యారు. వారికి కొన్ని అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చాము.

? స్థానిక గ్రంథాలయంలో అన్నీ వసతులు ఉన్నాయా

! గ్రంథాలయం ప్రస్తుతం రేకుల షెడ్డులో ఉంది. పక్కా బిల్డింగ్ నిర్మిస్తే బాగుంటుంది. మరుగుదొడ్లు, తాగునీరు, బెంచీలు, కుర్చీలు అందుబాటులో ఉన్నాయి.

? ప్రతేక కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తున్నారా..

! ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

? గ్రంథాలయ సభ్యత్వం పొందడం వల్ల ప్రయోజనాలు ఏమిటి.

! అనంతసాగరం గ్రంథాలయంలో 1050 మంది సభ్యత్వం తీసుకున్నారు. విద్యార్థులు రూ.50, పెద్దలు రూ.100తో సభ్యత్వం పొందితే పుస్తకాలను 14 రోజుల పాటు ఇళ్లకు తీసుకెళ్లి చదువుకొనే వెసులుబాటు ఉంది.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిసెట్ కౌన్సెలింగ్ కేంద్రం

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ బీ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఏపీ సాంకేతిక విద్యాశాఖ వెల్లడించిందని తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20 నుంచి 28 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, ఆత్మకూరు కేంద్రంలో కౌన్సెలింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7901620305, 8801089870 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

● తహసీల్దారుకు విజ్ఞప్తి

ఆత్మకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు తహసీల్దారు పీ పద్మజా కుమారిని కోరారు. ఆమె నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టడంతో నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకర పెంచల చౌదరి, ఉపాధ్యక్షుడు పేర్నాటి మాల్యాద్రి, మద్దినేని నారాయణ, బండారుపల్లి సర్పంచ్ ఇప్పగుంట పెంచల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 844 బేళ్లను తీసుకొచ్చారు. 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 473 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 371 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ280, కనిష్ఠ ధర రూ.180గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 98 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా డ్యాంలో 37.510 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,850 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 700 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

అనంతసాగరం జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదేవరాయపల్లిలో గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా జరుగుతోంది. సోమవారం మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం జరిగింది.

లేఅవుట్లలో అక్రమాలు

● వైసీపీ హయాంలో అనర్హులకు ఇళ్ల స్థలాలు
● ప్రజా ప్రయోజన స్థలాల ఆక్రమణ
● జోరుగా అమ్మకాలు

అనంత సాగరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పేదలకు ఇళ్ల స్థలాల పేరిట మండలంలోని అనంతసాగరం, సోమశిల గ్రామాల్లో వేసిన లేఅవుట్లలో అక్రమాలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనర్హులకు స్థలాలు, ఇళ్లు కేటాయించారని, ప్రజాప్రయోజనాల కోసం (గుడి, బడి, ఆసుపత్రి, ఇతర అవసరాలు) వదిలిన ఖాళీ స్థలాలను వైసీపీ నాయకులు, వలంటీర్లు పంచుకొని ఆక్రమించుకున్నారనే విమర్శలున్నాయి. అప్పట్లో అధికారులకు ముడుపులిచ్చి ప్రభుత్వ స్థలాలు కాజేసినట్లు ప్రచారం జరుగుతోంది. అనంతసాగరం ఎంపీడీవో కార్యాలయం వెనుక సర్వే నెంబరు 911, 912లో లేఅవుటు వేశారు. 200 మందికి స్థలాలు కేటాయించారు. స్థానిక నాయకులు తమకు కావల్సిన స్థలాలు రిజర్వు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కొక్క నాయకుడు, వలంటీర్లు రెండు నుంచి నాలుగు వరకు స్థలాలను వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరుతో తీసుకున్నట్లు తెలిసింది. స్థలాలు పొందిన వారి జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడినవారు కూడా ఉండటం విశేషం. ఇదిలా ఉండగా పేదల కోసం వేసిన లేఅవుట్లలో కొందరు ఇళ్ల స్థలాలు అమ్మకానికి పెడుతున్నారు. 9 అంకణాల ప్లాట్ రూ.లక్ష నుంచి 4 లక్షల వరకు పలుకుతోంది. ఈ లేఅవుట్లలో అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.



అనంతసాగరంలోని లే అవుట్లో నిర్మాణాలు

భూములకు పట్టాలిచ్చి ఆదుకోండి

ఆర్డీవో పావనికి రైతుల వినతి

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని పలువురు రైతులు ఆర్డీవో పావనిని వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరులో జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బలహీన వర్గాల వారికి కేటాయించిన అసైన్‌మెంట్, డీకేటీ పట్టా భూములను వ్యక్తిగతంగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న పేద రైతులను సీజేఎఫ్ఎస్‌లో సభ్యులుగా చేర్చి ప్రభుత్వమే సంస్థను నిర్వహిస్తూ వచ్చిం దని చెప్పారు. అయితే 2018లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సీజేఎఫ్ఎస్‌ను రద్దు చేసి వ్యక్తిగత పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 787 సీజేఎఫ్ఎస్‌లను రద్దు చేసి కొంత మంది రైతులకు వ్యక్తిగత పట్టాలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఆత్మకూరు సీజేఎఫ్ఎస్‌లో సభ్యులుగా ఉన్న వారికి మాత్రం ఇప్పటికీ వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయలేదని ఆరోపించారు. అర్హులను గుర్తించి పట్టాలు మంజూరు చేయాలని ఇటీవల మంత్రి రామనారాయణ రెడ్డి అధికారులకు సూచించడం హర్షదాయకమన్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో ఆ దిశగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గంటా లక్ష్మీపతి, సీజేఎఫ్ఎస్ సభ్యులు ఏ పెంచలమ్మ, కొండా వెంకటేశ్వర్లు, వెంకటయ్య పాల్గొన్నారు.



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నాయకులు

రీసర్వేలో తప్పిదాలను సరి చేయాలి

● కోటాయపల్లి రైతుల నిరసన

ఉదయగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తప్పిదాలు జరిగాయని వాటిని సరి చేయాలని మండలంలోని ఆర్లపడియ పంచాయతీ కోటాయపల్లికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల తహసీల్దారు కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో వాస్తవమైన పట్టాదారుడు కాకుండా సంబంధంలేని వ్యక్తుల పేర్లను, ఫొటోలను రికార్డు లకెక్కించారని, విస్తీర్ణాలను తగ్గించారని ఆరోపించారు. అనేకమార్లు సంబంధిత అధికారులను కలిసి విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అలాగే రహదారులు, సమాధులు, పెద్ద పెద్ద వృక్షాలు తొలగించడం తోపాటు వాగుపోరంబోకు భూమికి ఇతరులకు పట్టాలు మంజూరు చేశారని విమర్శించారు. అధికారుల తప్పిదాల వల్ల గ్రామాల్లో వివాదాలు తలెత్తి ఘర్షణలకు దారితీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు




చికెన్ వ్యర్థాల వాహనాన్ని అడ్డుకున్న జనసైనికులు

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసిలి గ్రామ సమీప పొలాల్లో నిల్వ ఉంచిన చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని జనసేన పార్టీ నాయకులు సోమవారం అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని, వ్యర్థాలను వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్డీవో, డీఎస్పీలకు జనసేన నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బండి అనిల్ రాయల్, డబ్బుగొట్టు నాగరాజు యాదవ్, మదన్‌కుమార్ యాదవ్, తోట భాస్కరయ్య, రాఘవేంద్ర, పాతపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలం

చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో అధికారులు అలసత్వం చూపుతున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గత సోమవారం గ్రీవెన్స్ డేలో ఆర్డీవో పావనికి వినతిపత్రం అందజేసినా చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం వ్యాప్తంగా చేపలు చెరువులు ఉన్నాయని, చేపల మేత కోసం కర్ణాటక, తమిళనాడు నుంచి చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారని తెలిపారు. ఇవి ప్రజారోగ్యానికి హానికరమని, ఇప్పటికైనా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్‌వాడీలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీలో సీడీపీవో సునీత

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం కార్యాలయంలో సీడీపీవో సునీత పీ-1,2 పుస్తకాలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రీస్కూల్ చిన్నారుల సంఖ్యను పెంచాలని, విధుల్లో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సూపర్‌వైజర్లు షేక్ షాను, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల ఏవోగా హిమబిందు

చేజర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండల వ్యవసాయ అధికారిగా పీ హిమబిందు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు మండల వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తున్న వీ శశిధర్ సంగం మండలానికి బదిలీకాగా, ఆయన స్థానంలో నెల్లూరులో పనిచేస్తున్న హిమబిందు బాధ్యతలు చేపట్టారు. రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుకు తగు సలహాలు, సూచనలు ఇస్తానని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఈ నెల 20లోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సుజాత, సుబ్బారావు, మండల అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు ఈకేవైసీ తప్పనిసరి

ఏఎస్ పేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ప్రయోజనం పొందాలంటే ప్రతీ రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

సంగం జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు విమల, నందిని, నరేంద్రకు రూ.11 వేల నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందించారు. పాఠశాల పూర్వవిద్యార్థి కే నవీన్‌కుమార్ ఈ నగదు బహుమతులిచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాసులురెడ్డి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఇన్‌చార్జి)గా సోమవారం కే శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి ప్రకాశం జిల్లాకు బదిలీ కావడంతో ఆ స్థానంలో వింజమూరులో ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులురెడ్డిని ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది.

డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పీ సందానీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన దుత్తలూరు డీటీగా పని చేస్తూ బదిలీపై సీతారామపురం వచ్చారు. కాగా, వరికుంటపాడు మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుభానీ ఉద్యోగోన్నతి పొంది మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం

ఏఎస్ పేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని అమలు చేసినందుకు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బూరి రమేష్ నాయుడు, నాయకులు కాటంరెడ్డి నరసింహారెడ్డి, షేక్ జిలానీ బాషా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సచివాలయంలో వేడుకలు నిర్వహించారు. విద్యర్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు సుధాకర్ రెడ్డి, షేక్ షబీర్, షేక్ ఖాదర్‌బాషా, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి బీసీ కాలనీకి చెందిన తుపాకుల వెంకట సుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతుం డటంతో మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి రూ.10 వేలు సాయం చేశారు. ఆ మొత్తాన్ని తన ప్రతినిధుల ద్వారా సోమవారం సుబ్బయ్య కుటుంబానికి అందజేశారు. మున్ముందు కూడా సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

గంగాభవానీకి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో కొలువైయున్న గంగాభవానీ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన జరిగింది. మహిళా భక్తులు అమ్మవారికి కాయాకర్పూరం, కుంకుమ, పసుపుతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెం కటరెడ్డి దంపతులు, నాయకులు పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

'సామూహిక యోగా'ను విజయవంతం చేయండి

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన అన్నీ సచివాలయాల్లో నిర్వహించే సామూహిక యోగా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎంపీడీవో అప్పాజీ, తహసీల్దారు రాంమోహన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అందులో భాగంగా మండలంలోని అన్నీ గ్రామ సచివాలయాల్లో సామూహిక యోగా కార్యక్రమం జరుగుతుందని, ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతీ ఒక్కరు హాజరు కావాలని కోరారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఉదయగిరి, సంగం మండలాల్లో గ్రామ రెవెన్యూ సహాయకుల వినతి

ఉదయగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు తహసీల్దారు రామ్మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వంలో వీఆర్ఏలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అరకొర వేతనంతో పని చేస్తున్న తమకు కుటుంబ పోషణ భారమైందని, వెంటనే పేస్కేలు అమలు చేసి, అర్హత కలిగిన వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని, నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు దుగ్గయ్య, పిచ్చయ్య, కొండయ్య, శేషయ్య, హుస్సేన్‌బాషా, అంజమ్మ, వెంగయ్య, నారాయణ, లింగయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు సమస్యలు తెలియజేస్తున్న వీఆర్ఏలు

● తహసీల్దారుకు వీఆర్ఏల వినతి

సంగం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం తహసీల్దార్ సోమ్లానాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. అర్హత ఉన్న వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని వారు కోరారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో టీడీపీ మైనార్టీ నేత మృతి

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెన్నాయపాలెం పంచాయతీ మూలంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి పట్టణ ఇస్లాంపేటకు చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష (50) అలియాస్ ఇట్టు సోమవారం మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కావలి మండలం పెద్దపట్టపుపాలెం నుంచి ఆదివారం సాయంత్రం మోటారుబైక్‌పై కావలి వస్తూ మార్గమధ్యంలోని మూలంపేట సమీపంలో అకస్మాత్తుగా రోడ్డుపై అడ్డువచ్చిన గేదెను ఢీకొట్టారు. ఈప్రమాదంలో బైక్ నడుపుతున్న తలారి సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలు కాగా వెనుక వైపు కూర్చుని ఉన్న ఖాదర్‌బాషాకు తీవ్రగాయాలు కావటంతో పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు నారాయణ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య షాహీదా, మోసిన్, మొమీనా ఇద్దరు కుమారైలు ఉన్నారు.



ఖాదర్‌బాషా (ఫైల్)

సీఎం, డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడి అరెస్ట్

● రిమాండ్‌కు తరలింపు

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ పీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కావలి అంబేడ్కర్ నగర్ 11వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు ఆత్మకూరి రాజేష్‌ను సోమవారం 1వ పట్టణ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. గత కొంతకాలంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌పై రాజేష్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతున్నాడని పట్టణంలోని 29వ వార్డుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు సిద్దవరపు ప్రకాష్, అలియాస్ జానీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జమాల్ వలీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ : ముగ్గురికి గాయాలు

మనుబోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుకుదురు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కొలనుకుదురు దళితవాడకు చెందిన కొంతమంది ఆటోలో కొత్త కోడూరుకు వెళ్లారు. తిరుగు ప్రయా ణంలో స్వగ్రామానికి వస్తుండగా కట్టువపల్లి దాటగానే బద్దెవో లుకు చెందిన ట్రాక్టర్ ఎదురుగా రావడంతో అదుపుతప్పి రెండు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఆటోలో ఆరుమందికిపైగా ప్రయా ణికులు ఉన్నారు. వీరిలో అజ్జం ఉదయ్‌కుమార్, గోను సుబ్రమ ణ్యం, గోను నరేంద్రలకు గాయాలయ్యాయి. వీరిలో ఉదయ్‌కుమా ర్‌కు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు అక్కడకు చేరుకుని 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమచికిత్స చేసి గూడూ ‌ు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి వెళ్లే రోడ్డు స్థలం ఆక్రమణల తో కుంచించుకు పోవడంతో రాత్రి సమయాల్లో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కొలనుకుదురు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

గంజాయి విక్రేతల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువచ్చి నెల్లూరులో అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నగరంలోని సంతపేట పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ. దశరథరామారావు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం బడకుల్ జిల్లా, గబాడర్ గ్రామానికి చెందిన బపి సాహు ప్రస్తుతం ముత్తుకూరు బస్టాండు వెనుక ఉంటున్నారు. చంద్రబాబునగర్ బీ బ్లాక్‌కు చెందిన షేక్ మాబాష ప్రస్తుతం సంతపేటలోని కామాక్షినగర్‌లో ఉంటున్నాడు. వీరిద్దరూ కొంతకాలంగా ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తెప్పిస్తున్నారు. అక్కడ కేజీ గంజాయిని రూ.5వేలు నుంచి రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేసి నెల్లూరుకి తీసుకువస్తారు. మన్సూర్‌నగర్‌కు చెందిన షేక్ రఫీకి గంజాయిని కేజీ రూ20 వేలకు విక్రయిస్తారు. రఫీ ఆ గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు, ఎస్ఐ జీ. బాలకృష్ణ తమ సిబ్బందితో కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం అందిన సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఉన్న కాళీ స్థలంలో వేపచెట్టు వద్ద సాహు, మాబాషలు గంజాయిని రఫీకు విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి నగదు కోసం గంజాయి విక్రయిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం వద్దు

● బుచ్చిరెడ్డిపాళెంలో స్థానికుల ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్‌రోడ్డు అంబేద్కర్ నగర్ 7వ వీధిలో ఓ భవనంపై సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని స్థానికులు సోమవారం అడ్డుకుని ఆందోళనకు దిగారు. తమ ప్రాంతంలో సెల్‌ఫోన్ టవర్ నిర్మించవద్దని మొరపెట్టుకున్నా నిర్వాహకులు రాత్రుల్లో గుట్టుచప్పుడు కాకుండా పనులు చేపట్టడాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఆవార్డు కౌన్సిలర్ ప్రత్యూష ద్వారా ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.



సెల్‌ఫోన్ టవర్ నిర్మాణదారులను నిలదీస్తున్న స్థానికులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

టీడీపీ మైనార్టీ నేత ఖాదర్‌బాష మృతి బాధాకరం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష అలియాస్ ఇట్టు అకాలమరణం బాధాకరమని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వేరువేరు ప్రకటనలలో సంతాపం వ్యక్తం చేశారు.

పలువురి టీడీపీ నేతల సంతాపం

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్ బాష (ఇట్టు) అకాల మృతిపై పలువురు టీడీపీ నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన అకాల మరణ వార్త విని టీడీపీ శ్రేణులతో పాటు వివిధ పార్టీల నేతలు, పట్టణ ప్రముఖులు, ముస్లింలు సంతాపం తెలిపారు. టీడీపీ రాష్ట్ర నేత మలిశెట్టి కుడి భుజాన్ని కోల్పోయానని కన్నీరుమున్నీరుగా విలపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, పలువురు నేతలు సంతాపం తెలిపారు.

న్యూస్ బాక్స్

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఇంకుడు గుంటలను పరిశీలిస్తున్న ఏపీడీ మృధుల తదితరులు

కొండాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెం గ్రామంలో ఉపాధి పనులను ఏపీడీ మృధుల సోమవారం పరిశీలించారు. గ్రామంలో తమకు ఉపాధి పనులు కల్పించడంలేదని, ఇంకుడు గుంతలు సక్రమంగా పూర్తిచేయలేదని తదితర సమస్యలపై గ్రామానికి చెందిన దామా మల్లికార్జున, కాంద్ర శ్రీహరి, చిమ్మిలి హరిబాబులు చేసిన ఫిర్యాదు మేరకు పరిశీలన చేయడం జరిగిందన్నారు. పరిశీలన అనంతరం ఆమె మాట్లాడుతూ కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీవో మురళీధర రావును ఆదేశించారు. క్షేత్ర సహాయకుడి ద్వారా మస్టర్లు వేయించాల్సి ఉంటుందన్నారు. ఇంకుడు గుంతలు, గోకులం షెడ్డును పరిశీలించిన ఆమె తాము సూచించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటేనే నిధులు విడుదలచేయడం జరుగుతుందన్నారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలుపై హర్షం

కొండాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ అమలులో భాగంగా తల్లికి వందనం నిధులు విడుదలచేయడంతో తల్లులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ. 13వేలు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం నిధులు త్వరలో ప్రభుత్వం విడుదల చేస్తుందని, దీనికి సంబంధించి ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

67పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 371 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 304 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-48, ఆర్ఆర్-5, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 67బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ. 260.14 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

నిర్ధిష్ట వ్యవధిలో సమస్యల పరిష్కారం



అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో ఒక్క సోమవారం అని కాకుండా నిత్యం గ్రీవెన్స్ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో వివిధ రకాల భూసమస్యలపై 9 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నందున ప్రతిరోజు అర్జీదారులు వస్తుంటారని, నిర్దిష్ఠ కాలపరిమితి లోపు వారి సమస్యలు పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఎక్కువగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ల సర్వే కోసం వస్తున్నారని 1బి, అడంగల్ తదితర భూ సమస్యలను అర్జీ ఇచ్చిన 90 నుంచి 105 రోజుల్లో, రేషన్‌కార్డు తదితర సమస్యలు 15 రోజుల కాలపరిమితి తో పరిష్కరించటం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

రైతులకు తప్పిన ఈకేవైసీ తిప్పలు

కందుకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈకేవైసీ తిప్పలు తప్పాయి. ఈనెల 20న అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా రైతులంతా తమ ఆధార్‌తో విధిగా ఈ కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో గత రెండు రోజులుగా గ్రామ, వార్డు సచివాలయాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద రైతులు ఈ కేవైసీ కోసం బారులుతీరారు. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవటం, మరోవైపు పథకం అమలు గడువు సమీపిస్తుండటంతో ఈ కేవైసీ పూర్తిచేయించుకోకుంటే తమకు డబ్బులు పడవేమోనన్న ఆందోళనతో రైతులు సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈక్రమంలో ఈ కేవైసీ తప్పనిసరి కాదని సోమవారం సాయంత్రానికి వ్యవసాయ శాఖ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి కబురందింది.

సమస్యల వలయంలో వసతి గృహాలు

విద్యార్థుల అవస్థలు



లింగసముద్రంలో శిథిలావస్థలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం

లింగసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసతిగృహాల్లో సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా 1990వ సంవత్సరంలో నిర్మించిన బీసీ బాలుర వసతిగృహం గత కొన్నేళ్ల క్రితమే శిథిల స్థితికి చేరింది. దీంతో బీసీ సంక్షేమశాఖ అధికారులు ఈ వసతిగృహాన్ని ఖాళీచేయించి, లింగసముద్రంలోని బలిజపాలెం గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, అందులో నిర్వహిస్తున్నారు.

ఇన్‌చార్జ్ వార్డెన్లే దిక్కు

కాగా, బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర వసతిగృహాల్లో కొన్నేళ్ల నుంచి ఇన్‌చార్జ్ వార్డెన్లే విధులు నిర్వహిస్తున్నారు. బీసీ బాలుర వసతిగృహానికి వలేటివారిపాలెం బీసీ వసతిగృహం వార్డెన్ వాకా మాల్యాద్రి, బీసీ బాలికల వసతిగృహానికి కందుకూరులోని కాలేజీ బాలికల వసతి గృహం మ్యాట్రిన్ కృశాన్ ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎస్సీ బాలుర వసతిగృహానికి గుడ్లూరులోని ఎస్సీ బాలుర వసతిగృహం వార్డెన్ శ్రీనివాసులు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. దీంతో వీరు ఈ వసతిగృహాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతుండడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కాగా, ఈ మూడు వసతిగృహాల్లో బీసీ బాలికల వసతిగృహాల్లో మాత్రమే సిబ్బంది కొరత లేదు. మిగిలిన బీసీ బాలుర వసతిగృహంలో వంట మనిషి మాత్రమే ఉన్నారు. అటెండరు వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఎస్సీ వసతిగృహంలో వాచ్‌మ్యాన్, వంట మనిషి ఉన్నారు. అటెండరు పోస్టు ఖాళీగా ఉంది. అలాగే విద్యార్థులకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్‌షీట్లు ఇంకా రాలేదని వార్డెన్లు మాల్యాద్రి, శ్రీనివాసులు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంకమ్మ పాత విగ్రహం ప్రతిష్ఠించాల్సిందే !

● ఆచారస్తులు, పెద్దల తీర్మానం



కందుకూరు గ్రామదేవత అంకమ్మ అమ్మవారి పాత విగ్రహం

కందుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కందు కూరు గ్రామదేవత అంకమ్మ పాత విగ్రహాన్ని కూడా ఆలయంలో ఏదో ఒకచోట ప్రతిష్ఠించాల్సిం దేనని ఆలయ పూర్వ ధర్మకర్త, మున్సిపల్ మాజీ చైర్మన్ దివి లింగయ్యనాయుడు నేతృత్వంలో ఆచారస్తులు, కొందరు పెద్దలు సోమవారం ఆలయంలో సమావేశం ఏర్పాటుచేసి తీర్మానించారు. ఈ సమా వేశంలో వివిధ గ్రామాలకు చెందిన ఆచారస్తులు, దేవర ఇళ్ల పెద్దలు పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహాన్ని పీఠాధిపతులను పిలిపించి వారి సూచనలకు అనుగుణంగా ప్రతిష్ఠ చేయాలని నిర్ణయించటంతో పాటు ఇటీవల దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కూడా ఆపేయాలని నిర్ణయించటం విశేషం.

ప్రభుత్వ స్థలాల్లోని నివాసితులకు న్యాయం చేయాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 30 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు 150 గజాల స్థలం క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కత్తి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పీ పెంచులయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. నేతలు మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయించాలని, గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం జీవో తీసుకొచ్చి 6నెలలు అవుతున్నప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని, ఇప్పటికైనా పేదలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దశల వారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపాలు, కృష్ణయ్య, కృష్ణమోహన్, మేడ వెంకటేశ్వర్లు, రమణయ్య, బాబురావు, శైలజ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లితండ్రులు ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరవది భాస్కర్ తల్లితండ్రులతో కలిసి మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం అమలు జరగడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నోట్‌పుస్తకాలు, యూనిఫారాలు అమ్మకూడదన్న నిబంధన పాటించడం లేదని, రకరకాల ఫంక్షన్ల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మహేంద్ర, కాలేషా, సురేష్, తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

● 21నుంచి సర్టిఫికెట్ల పరిశీలన


కందుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఏడాది నుంచి పాలీసెట్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమవుతుందని తెలిపారు. తొలిరోజు 15వేలు ర్యాంకు వరకు, 22న 32వేలు, 23న 50వేలు, 24న 68వేలు, 25న 86వేలు, 26న లక్షా 4వేలు ర్యాంకు వరకు, 27న లక్షా 20వేలు, 28న ఆపైన ర్యాంకులు ఉన్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ సర్టిఫికేట్ల పరిశీలన ఉంటుందన్నారు. 25వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ప్రక్రియ ప్రారంభమవుతుందని, జూలై 3న సీట్లను కేటాయిస్తారని తెలిపారు. కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఈఈఈ ప్రవేశాలతో పాటు ఈ కౌన్సిలింగ్ సెంటర్ నుంచి రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలకు కూడా వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

కావలిలో..

● కావలి రూరల్ : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ నుంచి 28 వరకు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ప్రారంభించడం జరుగుతుందని కావలి మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025 - 2026 విద్యా సంవత్సరానికి ఈనెల 20వ తేదీ నుంచి 27 వరకు విద్యార్థులు ఆన్‌లైన్ ప్రాసెసింగ్ కోసం ఒసి, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.250 ఫీజు చెల్లించాలి. ఆప్షన్ల నమోదుకు ఈ నెల 25వ తేదీ నుంచి 30 వరకు సమయం కేటాయించటం జరిగిందన్నారు. ఆప్షన్‌లలో మార్పు కోసం జూలై 1వ తేదీ, సీట్ అలాట్‌మెంట్ కోసం జూలై 3 నిర్దేశించగా జూలై 4వ తేదీ నుంచి 8 వరకు విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో సెల్ఫ్‌జాయిన్ అయ్యి కళాశాలలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. 21వ తేదీ నుంచి ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ 2025 హాల్‌టికెట్, పాలిసెట్ ర్యాంక్ కార్డు, ఎస్ఎస్సీ మార్కుల మెమో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, బదిలీ ధ్రువపత్రం, ఒసి విద్యార్థులకు ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలు ఒరిజనల్‌తో పాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. తదుపరి సమాచారం కోసం 9912983434, 9490079526, 9966797981 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నడిరోడ్డుపై మురుగునీరు

● పాదచారుల అవస్థలు



రైల్వే రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు

కావలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ రైల్వే రోడ్డులో నడిరోడ్డుపై మురుగునీరు చేరుతుండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయాల పక్కనుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో నడి రోడ్డుపై రైల్వేవారి మురుగునీరు చేరుతోంది. దీంతో ఆమార్గంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయాల నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ ఉన్నా అది పూడికతో నిండిపోవడంతో ఆ మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేట్టాలని పాదచారులు కోరుతున్నారు.

'తల్లికి వందనం'లో బడుగు వర్గాలకు అన్యాయం

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి నేతల ధర్నా



ధర్నా చేస్తున్నదళిత సంఘర్షణసమితి నేతలు

కావలి, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన తల్లికి వందనం పథ కం అమలులో బడుగు వర్గాల ప్రజలకు అన్యాయం జరుగు తోందని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ వర్తించేలా ప్రవేశపెట్టిన ఈ పథకం అమలులో అధికారుల అలసత్వం కారణంగా పేదలకు తల్లికి వందనం అందటంలేదన్నారు. ఈమేరకు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. అనంతరం మల్లి మాట్లాడుతూ పథకం అమలులో ప్రవేశపెట్టిన నిబంధనల కారణంగా నిజమైన పేదలకు ఈ పథకం వర్తించడం లేదన్నారు. పొలాలు లేనివారికి పొలాలు ఉన్నట్లు చూపించటం, బతుకుతెరువు కోసం ప్రయివేట్ అప్పులుచేసి కారులు నడుపుకుంటున్న వారికి వాహనాలు ఉన్నట్లు చూపటం, అసలు వాహనాలు లేని వారిని కూడా ఆ జాబితాలో చూపటం, అధిక విద్యుత్‌బిల్లుల పేరుతో కొందరిని పథకానికి దూరం చేయటం ఇంకా పలు సాంకేతిక సమస్యలతో బడుగు వర్గాలకు ఈ పథకం అందటంలేదన్నారు. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం వర్తించేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో శ్రీనివాసులు, చౌటూరి జనార్ధన్, జడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, కోటయ్య, నారుబోయిన లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల నిబంధనలు పునః పరిశీలించాలి



కందుకూరు సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కందుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పునః పరిశీలన చేయాలని కోరుతూ కందుకూరు డివిజన్‌లోని ఉద్యోగులు సోమవారం సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తిచేసుకున్న సచివాలయ ఉద్యోగులందరినీ బదిలీచేయాలని, ఉద్యోగులెవరికీ స్వంత మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వరాదని మార్గదర్శకాల్లో పేర్కొన్నారని ఒక యూఎల్‌బీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు మరో యూఎల్‌బీ పరిధిలోకి బదిలీలు చేయటం వలన కనీసం వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్న తమకు ఈ బదిలీలు ఆర్థిక, మానసిక ఆందోళనకర పరిస్థితులు తెస్తాయని పనిచేస్తున్న యూఎల్‌బీ పరిధిలోనే ఇతర మండలాలకు సచివాలయాలకు బదిలీలు చేసేలా మార్గదర్శకాల్లో మార్పు చేయాలని విజ్ఞప్తిచేశారు.



త్వరలో కావలిలో ఇంటింటికీ కొళాయి

● సాయిరాం, మున్సిపల్ డీఈ

ఈ ముఖాముఖి

కావలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకంలో భాగంగా త్వరలో కావలిలో ఇంటింటికీ మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు కావలి మున్సిపల్ డీఈ సాయిరాం తెలిపారు.

? కావలి పురపాలక సంఘంలో ఎన్ని గృహాలు ఉన్నాయి.

! 27వేల వరకు గృహాలు ఉన్నాయి.

?ఎన్ని మున్సిపల్ కొళాయి కనెక్షన్‌లు ఇచ్చి ఉన్నారు.

! ఇప్పటివరకు 6,200 కొళాయి కనెక్షన్‌లు ఇచ్చాం.

? ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఎప్పటికి అమలు చేస్తారు.

! త్వరలో అమృత్-1, అమృత్-2 పథకాల కింద ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నాం.

? అమృత్-1 కింద ఎన్ని కొళాయి కనెక్షన్‌లు ఇవ్వాలి... వాటిలో ఎన్ని ఇచ్చారు.

! 7530 కొళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి 2వేల కనెక్షన్‌లు ఇచ్చాం.

? అమృత్-2 కింద ఎన్ని కనెక్షన్‌లు ఇచ్చేందుకు అవకాశం ఉంది.

! 5వేల కనెక్షన్‌లు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాం.

? పట్టణంలో అక్రమ కొళాయి కనెక్షన్‌ల క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! అక్రమ కొళాయి కనెక్షన్‌లు గుర్తించేందుకు సచివాలయాలవారీగా సర్వే చేస్తున్నాం, వాటిని త్వరలో క్రమబద్ధీకరిస్తాం.

యోగాపై అవగాహన ర్యాలీ



కలిగిరిలో మానవహారం నిర్మించిన విద్యార్థులు, ఉద్యోగులు

కలిగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీఓ ప్రత్యూష పేర్కొన్నారు. సోమవారం యోగాపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి ఏడాది రూ.881 కోట్లు

ఎట్టకేలకు జిల్లా ప్రగతి బాట పట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి ఏడాదిలో రూ.881 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. నిర్వహణ లోపంతో దెబ్బతిన్న రోడ్లకు కొత్తరూపు తెప్పించింది. పల్లెలకు వెలుగులు పరిచింది. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన జరిగింది. వ్యవసాయానికి సాయం అందింది. ఐదేళ్ల పాటు సమస్యలతో అస్తవ్యస్తమైన జిల్లాలో ఇప్పుడిప్పుడే ప్రగతి జాడలు కనిపిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లా అభివృద్ధికి ఖర్చుచేసిన ప్రభుత్వం

ఐదేళ్ల తర్వాత కనిపిస్తున్న ప్రగతి జాడలు



గత వైసీపీ ప్రభుత్వంలో నాయుడుపేట- రాపూరు రోడ్డు దుస్థితి



కూటమి ప్రభుత్వం వచ్చాక బాగుపడిన రోడ్డు

చెదిరిన రోడ్లకు రూ.31.70 కోట్లతో కొత్త రూపు

జిల్లావ్యాప్తంగా ఆర్అండ్‌బీ పరిధిలోని రహదారులన్నీ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ లేక తారు, కంకర లేచిపోయి గోతులతో అధ్వాన్నంగా మారిపోయిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల పాటు జిల్లాలో రోడ్లు వాహనదారులకు నరకం చూపించాయి. గతేడాది జూన్‌లో ప్రభుత్వం మారడంతో రోడ్ల రూపు కూడా మారింది. జిల్లావ్యాప్తంగా 1053 కిలోమీటర్ల మేర రోడ్లకు రూ.22.44 కోట్లతో 122 మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో రోడ్లన్నీ యధాస్థితికి చేరాయి. కొత్తగా రూ.9.26 కోట్లతో 54.44 కిలోమీటర్ల నిడివి కలిగిన మూడు తారు రోడ్లను నిర్మించారు.



రూ.360 కోట్లతో జాతీయ రహదారుల ముస్తాబు

జిల్లాలో జాతీయ రహదారులు అధికంగా ఉన్న సంగతి తెలిసిందే. తిరుపతి నుంచీ దాదాపు ఏ మార్గం తీసుకున్నా జాతీయ రహదారే. అయితే కొత్త రోడ్డు ప్రాజెక్టులు, పాత రోడ్లకు మరమ్మతుల విషయమై సమీక్షించి, అవసరమైన ప్రతిపాదనలు చేసే ప్రయత్నాలేవీ గత వైసీపీ ప్రభుత్వంలో జరగలేదు. దీంతో పూతలపట్టు-నాయుడుపేట సిక్స్ లేన్ రోడ్డు, పీలేరు-తిరుపతి ఫోర్ లేన్ రోడ్డు, రేణిగుంట-పుత్తూరు-చెన్నై రోడ్డు వంటి కీలక రోడ్డు ప్రాజెక్టులన్నీ దాదాపుగా ఆగిపోయాయి. గతేడాది ప్రభుత్వం మారాకే వీటిల్లో పురోగతి మొదలైంది. ఎన్‌హెచ్ఏఐ నెల్లూరు పరిధికి సంబంధించి ఈ జిల్లాలో రూ.318.45 కోట్లతో 71.2 కిలోమీటర్లు నిర్మాణం జరగగా, చెన్నై పరిధికి సంబంధించి ఈ జిల్లాలో రూ.41.50 కోట్లతో ఎన్‌హెచ్ 716 రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి.

మహిళాభివృద్ధికి రూ. 53.77 కోట్లు

డీఆర్‌డీఏ ద్వారా 2703 మంది మహిళా వ్యాపారవేత్తలకు రూ.41.28 కోట్లు, 12,821 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 12.49 కోట్ల రుణాలు అందజేసింది. ఇలా మహిళాభివృద్ధికి రూ.53.77 కోట్లు వెచ్చించింది.

సాగు, తాగునీటికి రూ.22 కోట్లు

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో రూ.12.32 కోట్లతో బోర్ల తవ్వకాలు, పంప్ సెట్లు అమర్చడం, పైప్ లైన్లు వేయడం, డ్రెయిన్ల నిర్మాణం, శ్మశానాలకు నీటి సరఫరా తదితర 452 పనులు చేపట్టారు. అదే సమయంలో రూ.10.05 కోట్ల అంచనా వ్యయంతో ఇరిగేషన్ శాఖ చెరువుల పటిష్టీకరణకు, సప్లయ్ చానళ్లు, తూముల మరమ్మతుల వంటి పనులు పూర్తి చేసింది.

రూ.21 కోట్లతో పట్టణాల్లో మౌలిక వసతులు

జిల్లాలో తిరుపతి కార్పొరేషన్‌తో పాటు శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో రూ.21.68 కోట్లతో 180 పనులు చేపట్టారు. ఇందులో అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులూ ఉన్నాయి.

రూ.122 కోట్లతో వ్యవ'సాయం'

జిల్లాలో గడచిన ఏడాది కాలంలో వ్యవసాయం, పండ్ల తోటల పెంపకాలకు సంబంధించి రైతులకు కూటమి ప్రభుత్వం రూ.122 కోట్ల సాయం అందించింది. 6015 ఎకరాలకు బిందు సేద్య సదుపాయం కల్పించడానికి రూ.19.36కోట్లు వెచ్చించారు. వివిధ సందర్భాల్లో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారంగానూ, డ్రోన్లు పంపిణీ చేయడానికి, సబ్సిడీ విత్తనాలు అందించడానికి, పీఎం కిసాన్, పొలం పిలుస్తోంది తదితర కార్యక్రమాలకు రూ.97.58 కోట్లు ఖర్చు చేశారు. మరోవైపు 10.212 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రూ.4.92 కోట్ల సాయాన్ని రైతులకు అందజేసింది.

రూ.270 కోట్లతో పల్లెకు వెలుగు

గత జూన్ నుంచీ ఇప్పటి వరకూ రూ.270 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20.23 కోట్లతో పాడిరైతులకు మేలు జరిగేలా గోకులాల పేరిట 1499 పశువులకు షెడ్లు నిర్మించారు.ఇదే పథకం కింద రూ.141.75 కోట్లతో 5279 సామాజిక పనులు చేపట్టారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో రూ.104.40 కోట్లతో 209.77 కిలోమీటర్ల నిడివి కలిగిన 1663 సీసీ రోడ్లు నిర్మించారు. రూ.3.18 కోట్లతో 4.80 కిలోమీటర్ల మేరకు మూడు తారు రోడ్ల నిర్మాణం చేపట్టారు. అదే విధంగా రూ. 56 లక్షలతో 2.76 కిలోమీటర్ల మేరకు ఐదు మెటల్ రోడ్లు నిర్మించారు.





గత వైసీపీ హయాంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని విన్నమాల రోడ్డు - కూటమి ప్రభుత్వం వచ్చాక బాగుచేసిన రోడ్డు

సిండి'కేటు'తో మామిడి రైతుకు దెబ్బ

● ప్రభుత్వ ఆదేశాలూ బేఖాతరు

పాకాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు, వ్యాపారులు, దళారీలు సిండికేట్ కావడంతో తోతాపురికాయలు అమ్ముకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. గుజ్జుపరిశ్రమలు, ర్యాంపుల్లో టన్ను తోతాపురి రూ.8వేలకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. టన్ను ఐదారు వేల రూపాయలకు కూడా కొనడం లేదు. గుజ్జు పరిశ్రమల్లో పరిమితంగా కొనుగోలు చేస్తున్నారు. దళారీలు ర్యాంపులవద్ద టన్ను రూ.4వేలకు కూడా కొనడం లేదు. తోటల్లో పక్వానికి వచ్చిన కాయలను ర్యాంపులవద్ద కొనాలని దళారీలను రైతులు బతిమలాడుకుంటున్నారు. ర్యాంపుల్లో తక్కువ ధరకు కొన్న కాయలు గుజ్జు పరిశ్రమలకు టన్ను ఆరేడు వేల రూపాయల వంతున దళారీలు సరఫరా చేస్తున్నారు. ర్యాంపు యాజమాన్యాలు లాభాలు ఆర్జిస్తున్నా రైతులకు కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు.



ఇటీవల కురిసిన వర్షాలకు తోటల్లో తోతాపురి కాయలు ఒక్కసారిగా పక్వానికి వచ్చి రాలిపోతున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగుల మందులు, దుక్కి దున్నకాలకు ఎంతో వెచ్చించినా పంట అమ్ముకోలేక రైతులు దిగులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించి తోతాపురి కాయల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు. ర్యాంపులవద్ద ధరల పట్టిక బోర్డు పెట్టాలని కోరుతున్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగుచేసిన సన్నకారు రైతులు రెండు మూడు టన్నులు చొప్పున తీసుకువచ్చి మండీల్లో అమ్ముకుందామన్న ఫలితం లేకుండా పోతోంది. మండీల్లోనే మాగిపోతున్నాయి.



షార్ లేబర్ కాలనీలో నివాసితుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

● బెదిరింపు కాల్‌తో విస్తృత తనిఖీలు
● ఫేక్ కాల్ చేసింది సేలంవాసిగా గుర్తింపు
● తమిళనాడులో నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

ఉలిక్కిపడ్డ షార్!

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'షార్‌లో తీవ్రవాదులున్నారు. బాంబు పెట్టారు' అంటూ చెన్నై పోలీస్ కంట్రోల్ రూంకు వచ్చిన ఫోను కాల్‌తో షార్ ఉలిక్కిపడింది. అక్కడి పోలీసుల సమాచారంతో బాంబు స్క్వాడ్, పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది షార్‌లో జల్లెడ పట్టారు. రాత్రి వేళల్లో నిశ్శబ్ధంగా ఉండే షార్ కేంద్రంలో సోమవారం తెల్లవారు జామున ఓ పక్క పోలీసు జీపుల సైరన్, మరోపక్క శ్రీహరికోట లోపలున్న ఉద్యోగుల కాలనీ, లేబర్ కాలనీ, పలు కీలక విభాగ కార్యాలయాలు, వెలుపల రహదారుల పక్కన భద్రత దళాలతో నిండిపోయింది. పోలీసులు, సీఐఎస్ఎప్ సిబ్బంది దాదాపు 8 గంటల పాటు షార్‌లో అణువణువునా గాలించారు. సముద్ర మార్గంలోనూ తనిఖీలు చేసి నిఘా పెంచారు. ఉద్యోగస్తుల వాహనాలతో పాటు షార్‌కు వెళ్లే కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల వివరాలడిగి లోపలకు పంపించారు. మరోవైపు షార్ చుట్టుపక్కల తీర ప్రాంత గ్రామాలు, సూళ్లూరుపేట పట్టణంలోనూ అలజడి నెలకొంది. చివరకు ఫేక్‌కాల్‌గా నిర్ధారించారు. తమిళనాడు పోలీసులు ఇచ్చిన ఫోను నెంబరు ఆధారంగా ఆ ఫేక్ కాల్ చేసింది సేలంకు చెందిన బాలకృష్ణన్ విజయ్‌బాబుగా గుర్తించారు. సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండపనాయుడు తదితరులు సేలం వెళ్లి అక్కడి పోలీసుల సాయంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మానసిక స్థితి సరిగాలేక ఇలా పలుమార్లు.. అక్కడి కార్యాలయాలకూ బెదిరింపు కాల్స్ చేసినట్లు సమాచారం.



షార్‌లో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కార్యాలయం వద్ద బాంబు డిస్పోజల్ స్క్వాడ్



సీఐఎస్ఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు

నిఘా నీడలో..

ఫేక్ కాల్ అయినప్పటికీ షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన.. రెండో గేటు, చుట్టుపక్కల అడవుల్లో నిఘా పెంచారు. ప్రయోగ వేదిక వద్ద, తీరం వెంబడి భద్రత పెంచారు. లేబర్ కాలనీల్లో నివాసం ఉండే వారు తప్ప వారి బంధువులకూ అనుమతివ్వడం లేదు.

ఏరియల్ సర్వే రద్దుతో వెనుదిరిగిన అధికారులు

కోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): క్రిస్‌సిటీ భూములు.. పనులకు సంబంధించి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఏరియల్ సర్వే రద్దవడంతో అధికారులు వెనుదిరిగారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సోమవారం ఉదయం ఆయన కోట మండలం కొత్తపట్నం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తారని స్థానిక అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, ఏపీఐఐసీ అధికారులు క్రిస్‌సిటీ భూములకు చేరుకున్నారు. ఏరియల్ సర్వే జరుగుతుందని నిరీక్షించారు. చివరి క్షణంలో హెలికాప్టర్‌లో సాంకేతిక లోపంవల్ల పర్యటన రద్దవడంతో వీరంతా వెనుదిరిగారు.

19న బీవీపాలెంలో జిల్లాస్థాయి 'యోగాంధ్ర'

తడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం ఈ నెల 19వ తేదీ తడ మండలం బీములవారిపాళెం వద్ద జరుగుతుందని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పడవలరేవు వద్ద ఉన్న పర్యాటకశాఖ రిసార్టులను పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరవుతారని, అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

గూడూరు మున్సిపల్ స్పెషలాఫీసర్ పదవీకాలం పొడిగింపు

తిరుపతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు మున్సిపాలిటీ స్పెషలాఫీసర్ పదవీ కాలాన్ని ప్రభుత్వం ఆరు నెలల పాటు పొడిగించింది. ఎన్నికలు జరగని కారణంగా గూడూరు మున్సిపాలిటీకి సబ్ కలెక్టర్ స్పెషలాఫీసర్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. స్పెషలాఫీసర్ పదవీ కాలం గత నెల 5వ తేదీతో ముగిసిపోయింది. దీంతో గత నెల 6 నుంచీ నవంబరు 5వ తేదీ వరకూ ఆరు నెలల పాటు పదవీ కాలాన్ని పొడిగిస్తూ సోమవారం రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్విమ్స్, రుయాకు కొవిడ్ టెస్టు కిట్లు వచ్చాయ్

తిరుపతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కరోనా ర్యాపిడ్ టెస్టు కిట్లు అందుబాటులోకి వచ్చాయి. స్విమ్స్, రుయా ఆస్పత్రి అత్యవసర విభాగాల్లో అనుమానిత రోగులకు కొవిడ్ టెస్టులు చేసేందుకు 700 చొప్పున ర్యాపిడ్ కిట్లు అందించామని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

స్విమ్స్ క్యాజువాల్టీ రోగులకు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో అందుబాటులో లేకపోయినా కొవిడ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్లు తెచ్చుకోవాలని చీటీలు రాయడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'కిట్లు ఎక్కడనుంచి తేవాలి' శీర్షికన కథనం ప్రచురితమైంది.దీనిపై స్విమ్స్ వైద్యాధికారులు రామ్, కోటిరెడ్డి, మునస్వామి, శివశంకర్ సమావేశమయ్యారు.స్విమ్స్ అత్యవసర విభాగంలో చేరే కొవిడ్ అనుమానిత రోగులకు ర్యాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని మెడికల్ సూపరింటెండెంట్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొవిడ్ పరీక్షలు చేసుకోదలచినవారు స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రి సెల్లార్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పాజిటివ్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలనుకునే వారికి పద్మావతి ఆస్పత్రిలో 6 పడకలతో ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు.

నిర్మాణ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించండి

● సౌత్ కోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథుర్

తిరుపతి(సెంట్రల్), జూన్16 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టు పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలని సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజరు సందీప్ మాథుర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఎయిర్ కాన్‌కోర్సు నిర్మాణాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయాలు, ప్రయాణికులకు కలిగే అసౌకర్యాల గురించి తెలుసుకున్నారు. నిర్మాణాల సమయంలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాల గురించి అడిగారు. ఇక, రైల్వే స్టేషన్ అభివృద్ధి, తిరుపతి-చెన్నై బైపాస్ మార్గం పనులు, రేణిగుంటలో రూ.25 కోట్లతో జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. పూడి- ఏర్పేడు బైపాస్ లైన్ ప్రాజెక్టు ఏదశలో ఉందని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి- నడికుడి రైలు మార్గం పనులు ఏ దశలో.. ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. ఇలా రెండున్నర గంటల పాటు అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం సీఈ సూర్యనారాయణ, ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు వామనమూర్తి, డాక్టర్ శ్రావణకుమార్, మణికుమార్, సాయివిజయ్ కుమార్, మణికంఠ, సుదర్శన్, రమేష్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనరు రాజగోపాల్ రెడ్డి, సుంకన్న, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, మాధవరావు, రాంబాబు, ఎం.సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంకు సన్మానం

సౌత్ కోస్ట్ రైల్వే జీఎంగా తొలిసారిగా తిరుపతికి వచ్చిన సందీప్ మాథుర్‌ను మజ్దూర్ యూనియన్ నాయకులు సురేష్ కుమార్, రవీంద్ర నాయక్ సన్మానించారు. నాయకులు శ్రీనివాసులు, రాజేష్, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకూ క్యూఆర్ కోడ్

● తిరుపతిలో డిజిటలైజేషన్ నెంబర్ల కేటాయింపు
● దశలవారీగా జిల్లా అంతటా అమలు

6లో

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పోలీసులు ఆటోలను డిజిటలైజ్ చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా డ్రైవర్ల ఆగడాలకు చెక్ పెట్టేలా చర్యలు చేపడుతున్నారు. తిరుపతిలో సోమవారం 200 ఆటోలకు డిజిటలైజ్ చేయగా, దశలవారీగా మిగతా ఆటోలకు, జిల్లా అంతటా అమలు చేయనున్నారు.



ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అతికిస్తున్న సిబ్బంది

స్టాప్ డయేరియా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార నియంత్రణకు సోమవారం నుంచి జూలై 31వ తేదీ వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఈ కార్యక్రమ పోస్టర్లను కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. రోజుకు మూడు కంటే ఎక్కువ సార్లు నీళ్ల విరేచనాలైతే డయేరియాగా భావించాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల దీనిని నివారించవచ్చన్నారు. 2 నుంచి 6 నెలల వయసు వరకు సగం జింక్ టాబ్లెట్.. 6 నెలల నుంచి 5 సంవత్సరాల వరకు ఒక టాబ్లెట్‌ను ఓఆర్ఎస్‌తో పాటు ఇవ్వాలన్నారు. డీఎల్ఏటీవో, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చత్రప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



ఆర్కే రోజా, మీనా - ఇంద్రజ

శ్రీవారి సేవలో సినీతారలు

తిరుమల శ్రీవారిని సోమవారం మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీనటులు మీనా, ఇంద్రజ దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన నటులను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. రోజా, మీనా తదితరులు తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం వద్ద పీయూష్ గోయల్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్



అమ్మవారి సేవలో మంత్రులు

తిరుచానూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్ దర్శించుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, టీటీడీజేఈవో వీరబ్రహ్మం, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నటి ఇంద్రజ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- శనివారం హుండీ ఆదాయం: రూ.4.52 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,815
- తలనీలాలు సమర్పించినవారు: 35,007



డీఐపీఆర్వోగా గురుస్వామిశెట్టి - డీపీఆర్వోగా రమేష్ - జిల్లా భూగర్భ జలాల డీడీగా శోభన్‌బాబు



కలెక్టర్‌ను కలిసిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్

కొత్త అధికారులొచ్చారు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులు సోమవారం ఆయా శాఖల కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్‌గా శోభన్‌బాబు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా చంద్రశేఖర్, డీఐపీఆర్వోగా గురుస్వామిశెట్టి, డీపీఆర్వోగా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించిన వారిలో ఉన్నారు.

తుడా వీసీగా జేసీ బాధ్యతలు



తిరుపతి, జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)వీసీగా నియమితులైన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు పట్టణాభివృద్ధి సంస్థలకు వీసీలుగా జేసీలకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం తుడా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన జేసీకి చైర్మన్ దివాకర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఇప్పటివరకు వీసీగా ఉన్న నగర కమిషనర్ మౌర్యకు వీడ్కోలు పలికారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మతకాముడి గ్రామంలో సోమవారం రాత్రి అన్న చేతిలో తమ్ముడు హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు.... దాయాదులైన ఇద్దరు అన్నదమ్ముల మధ్య కుటుంబ గొడవలు ఉన్నాయి. సోమవారం రాత్రి మట్టం సురేష్, అతని తమ్ముడు మట్టం మునిచంద్ర నడుమ తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకుంది. ఆవేశానికి గురైన సురేష్ ఇంట్లో ఉన్న సూరికత్తి తీసుకుని తమ్ముడు మునిచంద్ర(25)ను పొడిచాడు. కత్తి గుండెపైన గుచ్చుకోవడంతో మునిచంద్ర అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. కాగా, ఘర్షణ సమయంలో ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

భవనంపై నుంచి పడి కూలీ మృతి


తిరుపతి (నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ వైకుంఠపురంలోని ఓ ఐదంతుస్తుల భవనం పైనుంచి పబడి కూలీ సతేంద్రకుమార్‌శా (29) మృతిచెందారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఎర్ర నరసారెడ్డి నిర్మిస్తున్న భవనానికి సంబంధించి పనుల కోసం బిహార్ నుంచి మంతుశా, అతడి బావమరిది సతేంద్రకుమార్‌శాతో పాటు మరికొంతమంది కూలీలు వచ్చారు. ఆదివారం సెలవు కావడంతో పని ముగించుకుని సతేంద్రకుమార్‌శా మద్యం తాగారు. తమ వసతికి ఇచ్చిన రెండో ఫ్లోర్‌లో అందరూ పడుకుని ఉండగా.. సతేంద్రకుమార్‌శా మద్యం మత్తులో అర్ధరాత్రి నిర్మాణంలోని భవనం 5వ అంతస్తుకు నడుచుకుంటూ వెళ్లి అక్కడి లిఫ్ట్‌రూమ్‌పైకి ఎక్కి పడుకున్నారు. ప్రమాదవశాత్తు దొర్లడంతో పక్క ఇంటిలోని బైక్‌పై పడ్డారు. తీవ్ర గాయాలయ్యాయి. ఆ శబ్దానికి ఆఇంట్లోని సునీల్ కుమార్ బయటకు వచ్చి చూడగా అపస్మారక స్థితిలో సతేంద్ర కుమార్ ఉన్నారు. మిగతా కూలీలకు సమాచారం ఇచ్చి.. తన కారులోనే రుయాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినారు, తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



తిరుపతి (నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్కూల్ బస్సులు, వాహనాలను పోలీసు, ఆర్టీఈ అధికారులు సోమవారం సంయుక్తంగా తనిఖీలు చేశారు. ప్రైవేట్ స్కూల్ బస్సుల రికార్డులు, పర్మిట్‌లను పరిశీలించారు. స్కూల్ బస్సుల లీగల్ కండిషన్, బస్సుల ఆర్సీ, బీమా, పొల్యూషన్, ఫస్ట్ ఎయిడ్ బాక్సు తనిఖీ చేవారు. డ్రైవర్ల అర్హతలే, లైసెన్సు, వాహనం నడిపే సమయంలో.. పిల్లలు బస్సు ఎక్కినప్పుడు.. దిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. స్కూల్ బస్సులకు పర్మిట్లు లేకుండా నడిపితే సీజ్ చేసి ఆర్టీవోకు పంపుతామని స్పష్టంచేశారు. స్కూల్ బస్సులు, వ్యాన్లను వేగంగా నడిపే డ్రైవర్లపైనా చర్యలు చూసుకుంటామని హెచ్చరించారు. స్కూల్ బస్సులు 40 కిలోమీటర్లకు మించి వేగం లేకుండా నడపాలన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ యాజమాన్యం ఎప్పటికప్పుడు డ్రైవర్లపై నిఘా పెట్టాలని ఆదేశించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తిరుపతి(వైద్యం), జూన్ 16(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే రోజూ క్రమం తప్పకుండా యోగా చేయాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని పలు ఆసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రాధా, వైస్ ప్రిన్సిపాళ్లు డీఎస్ఎన్ మూర్తి, రోజారమణి. రవీంద్ర, అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడికి పరికరాల వితరణ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపీ నిధుల ద్వారా శ్రీకాళహస్తి మండలం ఆంజనేయపురానికి చెందిన విభిన్నప్రతిభావంతుడు సుబ్బరాయలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.5లక్షలు విలువైన హైడ్రాలిక్ ఫైబర్ ఫుట్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, రాజశేఖర్, రాజు, చెంచల్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



హైడ్రాలిక్ ఫైబర్ ఫుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కిక్కిరిసిన కలెక్టరేట్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- పీజీఆర్ఎస్‌కు 307 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించేందుకు వచ్చిన అర్జీదారులతో సోమవారం కలెక్టరేట్ కిక్కిరిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. పదేపదే తిరుగుతున్నా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని కొందరు అధికారుల ఎదుట వాపోయారు. మొత్తం 307 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకు 135 వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ తదితరులు పాల్గొన్నారు.

13ఏళ్లుగా ఆధార్‌కార్డు కోసం తిరుగుతున్నా..



'ఆధార్ కార్డు కోసం 13ఏళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. భర్త 40 ఏళ్ల క్రితం చనిపోయాడు. కుమార్తె బతుకుదెరువు కోసం చెన్నైకి వెళ్లింది. కూలి పనులకు పోలేక పస్తులతో కాలం గడుపుతున్నా. ఆధార్‌కార్డు లేకపోవడంతో పింఛను అందడంలేదు. మీరైనా స్పందించి న్యాయం చేయండి' అంటూ ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన కె.నాగరత్నమ్మ అధికారులకు విన్నవించింది.

పింఛను ఇచ్చి ఆదుకోండి



'కూలి పనులు చేసుకుంటూ బతికేవాడిని. గత దీపావళి పండుగ రోజు బాణసంచా పేలి రెండు కాళ్లు కోల్పోయాను. ఇంటికే పరిమితం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇచ్చి ఆదుకోండి' అంటూ వెంకటగిరికి చెందిన శివ అధికారులను కోరాడు.

రూ.25వేలలోపు జీతగాళ్లకు 'తల్లికి వందనం' ఇవ్వండి

తల్లికి వందనం పథకం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులకూ వర్తింపజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, డీవైఎఫ్‌ఐ నేత సుమన్ వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రూ.25వేలు కంటే తక్కువ జీతం పొందే ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తామని ప్రకటించారని, ఆ మేరకు అమలు చేయాలని కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో ప్రభుత్వ భూములను కాపాడాలని సర్పంచ్ దామినేటి కేశవులు, గ్రామస్థులు కోరారు. పేరూరులో రూ.20 కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు కొందరు ప్రణాళిక వేసుకున్నారన్నారు. కాసింకాలువ గడ్డను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. చెరువు, కాలువ భూముల్లోనూ అక్రమ కట్టడాలు కట్టారన్నారు. వాటిపై దృష్టి సారించాలని కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

కాలువను కాపాడండి

స్వర్ణముఖి నది నుంచి తిరుపతి రూరల్ మండలంలోని పేరూరు చెరువుకు నీటిని తీసుకువచ్చే కాలువను కాపాడాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి జేసీ శుభం బన్సల్‌కు విన్నవించారు. సి.మల్లవరం జంక్షన్ నుంచి రేణిగుంట మండలం గాజులమండ్యం జంక్షన్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయని, ఇందులో భాగంగా కాలువలను సమూలంగా పూడ్చి వేస్తున్నారన్నారు. పేరూరు చెరువుకు నీరు రావడం వల్ల తిరుపతి రూరల్ మండలంలో సగానికిపైగా పంచాయతీలకు నీటి సమస్య తీరుతుందని వివరించారు. నేషనల్ హైవే అథారిటీ వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సన్నద్ధం

- భక్తుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఏర్పాట్లు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు సురక్షిత ప్రయాణం అందించడమే లక్ష్యంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన 11 డిపోల పరిధిలో తిరుమలకు నడుస్తున్న 430 బస్సుల మరమ్మతులు, రంగులు, లైటింగ్, సాంకేతికపరమైన అంశాల తనిఖీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డీపీటీవో వెంకటరావు ఆధ్వర్యంలో, డిప్యూటీ సీఎంఈ బాలాజీ పర్యవేక్షణలో రూ.కోటి వ్యయంతో ఐదు దశలలో బస్సులను ముస్తాబు చేస్తున్నారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆటోలకూ క్యూఆర్ కోడ్

- తిరుపతిలో డిజిటలైజేషన్ నెంబర్ల కేటాయింపు
- దశలవారీగా జిల్లా అంతటా అమలు
- ప్రయాణికుల భద్రతకు పోలీసుల చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొందరు ఆటోవాలాల ఆగడాలకు చెక్‌పెట్టేలా పోలీసులు క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మొదటి దశలో తిరుపతిలోని 200 ఆటోలను డిజిటలైజేషన్ చేశారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి ఆధ్వర్యంలో సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఆటోల డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఆటోకు డ్రైవర్ వెనుక సీటులో ట్రాఫిక్ పోలీసులు తయారు చేసిన క్యూఆర్ కోడ్‌తో పాటు అందులో వున్న ఎనిమిది అంశాలతో కూడిన స్టిక్కర్‌ను అతికించారు. ఎవరైనా ఆటో డ్రైవర్లు తమతో దురుసుగా ప్రవర్తించినా, మద్యం తాగి నడిపినా, ఇతర విలువైన వస్తువులు ఆటోలో పోగొట్టుకున్నా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఇబ్బంది పెట్టినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపితే చాలు. వెంటనే ఆ ఆటో వివరాలు, ఎక్కడుందనేది కమాండ్ కంట్రోలు ద్వారా పోలీసులు గుర్తించి చర్యలు తీసుకుంటారు. నేరస్తులు ఆటోలో ప్రయాణించి దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే గుర్తించవచ్చని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఈ క్యూఆర్ కోడ్‌లో ట్రాఫిక్ డీఎస్పీతో పాటు సీఐలు, పోలీసు స్టేషన్ నెంబర్లు పొందుపరిచారు. ఆటో యజమాని పేరు, అడ్రస్, ఫొటో, డ్రైవింగ్ లైసెన్సు నెంబరు, స్టాండు ఏరియా, మొబైల్ నెంబరు, ఆటో నెంబరు, అత్యవసరమైన ఫోన్ నెంబర్లు ఉంటాయి. ఆటోలో ఎక్కిన వెంటనే ప్రయాణికుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మొబైల్‌లో ఉంచుకోవాలి. తద్వారా అందులో పొందుపరచిన ప్రింట్, షేర్ ఆన్ వాట్సాప్, ట్రాక్ లొకేషన్, అత్యవసర కాల్ నెంబర్లు, పోలీసు స్టేషన్ వివరాలు, ఫిర్యాదు చేయాలంటే సమీపంలోని పోలీసు స్టేషన్ ఏది అనే వివరాలు అందులో ఉంటాయి.



ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ఎన్‌రోల్ చేసుకోవాలి

తిరుపతిలోని అన్ని ఆటోలకు తప్పనిసరిగా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తి చేశారు. క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశాక అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, డీటీవో మురళీమోహన్, రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కర నాయక్, సుబ్బారెడ్డి, ఎస్‌ఐలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలోని 20వేలకుపైగా ఉన్న ఆటోలన్నీ తప్పనిసరిగా డిజిటలైజేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుల్లెట్‌రమణ, కృష్ణయాదవ్, మధు, ప్రమోద్, రామచంద్ర, ఆటో అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా, ఆటో డ్రైవర్లు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీ సమస్యలేవో చెప్పండి

- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులదారుల వద్దకొచ్చి అడిగిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుదారుల వద్దకే ఎస్పీ హర్షవర్ధనరాజు వచ్చారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. సాధారణంగా అర్జీదారులు సంబంధిత కౌంటర్లలోని సీఐల వద్దకు వెళ్లి అక్కడ వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి మళ్లీ అదనపు ఎస్పీల వద్దకు వెళ్లి అక్కడ నుంచి ఎస్పీ చాంబర్‌కు వెళ్లి తమ సమస్యలను చెప్పేవారు. దీనివల్ల ఎస్పీ వద్దకు వెళ్లేసరికి ఫిర్యాదుదారులలు కనీసం గంట పాటు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ క్రమంలో సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా ఫిర్యాదుదారుల వద్దకే ఎస్పీ వెళ్లారు. వారి పేర్లు, ఎక్కడ నుంచి.. ఏ సమస్యపైన వచ్చారు? ఎన్ని రోజులుగా వస్తున్నారు? గతంలో మీ సీఐ కానీ, ఎస్ఐకి కానీ కంప్లెయింట్ చేశారా? అని వివరాలు తెలుసుకున్నారు. సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 99 సమస్యలు రాగా.. దాదాపు 53 సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మిగిలిన సివిల్ తగాదాలు, ఆర్థిక లావాదేవాలు, కోర్టు కేసులు, భార్యాభర్తల తగాదాలు వంటి వాటికి తమ వద్ద పరిష్కారం వుండదని నేరుగా న్యాయ స్థానాలను ఆశ్రయించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎవరైనా అలక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్పీ పీఆర్ఓలు నాగరాజు, తిరుమల రావు, సిబ్బంది పాల్గొన్నారు.



వికలాంగురాలి వద్దకు వచ్చి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

- దివ్యాంగురాలు సుమతి ఇతర సహాయకుల ద్వారా వీల్‌చైర్‌లో ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఈమెను గమనించిన ఎస్పీ నేరుగా వెళ్లి పిటీషన్‌ను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో గాంధీ చిత్రపటానికి కేకులు తినిపిస్తూ అపహాస్యం చేస్తున్నారంటూ ఆమె ఫిర్యాదు చేయగా.. వెంటనే విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.
- మెడకు కండువా కప్పుకొని ఒక పక్కన నిలబడి ఉన్న తిరుపతి లింగేశ్వర నగర్‌కు చెందిన వెంకటనారాయణను ఎస్పీ పలకరించారు. 'సర్వే నెంబరు 147-1లో నేను చిన్న రేకుల షెడ్డు వేసుకుని జీవనం సాగిస్తున్నా. అదే ప్రాంతానికి చెందిన ప్రమోద్, చిట్టిబాబు వచ్చి ఆ స్థలం వారిదంటూ ఆక్రమించుకుని నన్ను అడ్డుకుంటున్నారు'అని ఎస్పీతో ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం విచారించి న్యాయం చేయాలని రూరల్ సీఐ చిన్నగోవిందును ఆదేశించారు.

అభ్యంతరాలపై నాలుగు వారాల్లో నివేదించండి

- వెటర్నరీ వర్సిటీ వీసీని కోరిన ఏజీ ఆడిట్ అధికారులు

తిరుపతిరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలోని ఆడిట్‌కి సంబంధించిన అభ్యంతరాలపై నాలుగువారాల్లో నివేదించాలని వీసీ జేవీ రమణని అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అధికారులు ఇటీవల రిపై కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్సిటీలని క్షుణంగా ఆడిట్ చేసి నివేదించాలని ఏజీ ఆడిట్ అధికారులను ఆదేశించారు. దీంతో వెటర్నరీ వర్సిటీ పరిధిలో 2024 జూలై 10 నుంచి 2025 మార్చి 26 వరకు నాలుగు దఫాలుగా ఆడిట్‌ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ, ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్, ఐసీఏఆర్ డెవలప్‌మెంటల్ నిధులతో చేపట్టిన పనులకు వర్సిటీ ఏసీ ఆఫీసుకి బిల్లులు సెటిల్‌చేయకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా నిధులను ఖర్చుచేయడం, అగ్రిమెంట్ ప్రకారం సివిల్ పనులు సకాలంలో పూర్తిచేయకపోవడం, అదనంగా నిధులు కేటాయించడం, వైసీపీ హయాంలో ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన గోపాలకృష్ణ ద్వివేదికి బోర్డు అనుమతి లేకుండా మెడికల్ రీయింబర్స్ బిల్లులు క్లెయిమ్ చేసి.. డ్రా చేయడం, అదే ప్రభుత్వంలో వర్సిటీ కౌన్సిల్‌కి ఒక అడ్వొకేట్‌ని మాత్రమే అపాయింట్ చేయగా.. అదనంగా మరో 5మంది అడ్వొకేట్లని ఎంగేజ్ చేయడం, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో (బ్యాక్‌లాగ్)లో నెట్ అర్హత లేనివారికి పోస్టింగులు, పదోన్నతులు ఇవ్వడం, దీనిలో 2013 నుంచి చేపట్టిన నియామకాల్లో 49మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకి నెట్ అర్హత లేకపోవడం, పదవీవిరమణ పొంది వయోపరిమితి 60-62 ద్వారా పనిచేసిన ఉద్యోగులకు రావాల్సిన జీత, భత్యాల కన్నా ఎక్కువగా డ్రా చేయడం, పాలకమండలి అనుమతిలేకుండానే నిధుల మంజూరు, వర్సిటీ డైరెక్ట్ రిసిప్ట్ నుంచి చెల్లించడం, ఎన్‌యూఎఫ్ ఎక్స్‌పెండేచర్, ఇద్దరు ఉద్యోగుల మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్, ఓ ఉద్యోగి పదోన్నతి, లీవ్ నాట్ డ్యూటీ కింద నిబంధనలకు విరుద్ధంగా సెలవుల మంజూరు , పెన్షన్ ప్రపోజల్ సాంక్షన్స్, నెట్ కంపెనీకి లేట్ చార్జీలు చెల్లింపు, ఆర్టీఐ రిజిస్టర్స్ ప్రాపర్‌గా మెయిన్‌టైన్స్ తదితర ఇరెగ్యులర్ అంశాలకి సంబంధించి స్పెషిఫిక్ రిమార్క్‌పై నాలుగువారాలలోపు నివేదించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వెటర్నరీ వర్సిటీ పరిపాలనాభవనం

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్

గూడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఈ సభలను నిర్వహించి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గాంధీనగర్ ప్రాంతంలో నీటి ఎద్దడి ఉందని, అధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మౌలిక వసతులను మెరుగుపరచాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలను మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణాలకు రూ. 5లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, నారాయణ, కృష్ణ, శేషయ్య, కరిముల్లా, రాజా, సీవీఆర్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వడంతో పాటు పారిశుధ్య కార్మికులకు డీఆర్‌సీ జీతాలు, కరువు భత్యం అమలు పరచాలన్నారు. గత సమ్మెకాలంలో కుదుర్చుకున్న ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలలో శివకుమార్, బీవీ రమణయ్య, కోటేశ్వరరావు, మణి, వెంకటరమణ, ఆనంద్, రాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను కాపాడండి



ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, ఏఆర్‌డీ సంస్థ ప్రతినిధులు

కోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కేంద్రమైన సిద్ధవరంలో ప్రభుత్వ భవనాలను కాపాడాలని గ్రామస్తులు, ఏఆర్‌డీ సంస్థ ప్రతినిధులు ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సిద్ధవరంలో తుపాన్ షెల్టర్ కూలిపోయే స్థితిలో ఉందన్నారు. ఆ షెల్టర్‌లోకి విద్యార్థులు, గ్రామస్తులు వెళ్తుంటారని ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం శిథిలావస్థలో ఉందని, దాన్ని పడగొట్టి కొత్త భవనం నిర్మించాలన్నారు. అదేవిధంగా దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ భవనం గోడలకే పరిమితమై ఉందని, దానిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామయ్య, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టును నిర్మించాలి



నిరసన తెలుపుతున్న చింతా మోహన్ తదితరులు

నాయుడుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నం పోర్టు అభివృద్ధి పనులను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద దుగరాజపట్నం పనులు చేపట్టనందుకు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం దుగరాజపట్నం పోర్టు అభివృద్ధికి నిధులు కేటాయించిందన్నారు. అనంతరం కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో దుగరాజపట్నం పోర్టు అభివృద్ధి పనులపై దృష్టి సారించలేదన్నారు. దుగరాజపట్నం పోర్టు నిర్మాణంతో వేలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుందన్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ ప్రభుత్వం దుగరాజపట్నం పోర్టు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాడి వెంకటయ్య, చందన మూడి శివ, నాగూరయ్య, వెంకటరాజు, శంకరయ్య, తేజోవతి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

వెంకటగిరి టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రాంతంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా, కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. సోమవారం వెంకటగిరి పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం 17 ఏళ్ల సంవత్సరం క్రితం బీహెచ్‌ఈఎల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుందని, తరువాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మన్నవరం పనులు పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

తడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తేజారెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అక్కంపేటలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, గోపి ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

మోటర్లు, స్టార్టర్లు, కేబుల్స్ చోరీ

పెళ్లకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లపాడు పొలాల్లోని బోరు మోటర్లు, స్టార్టర్లు, కేబుల్ వైర్లను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించుకుని వెళ్లినట్లు రైతులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్లపాడు గ్రామానికి చెందిన మణికిరి నారాయణరావుకు చెందిన స్టార్టర్, కేబుల్ వైర్లు, రాయపాటి రవికుమార్ స్టార్టర్, చిల్లకూరు మునివర్ధన్ రెడ్డి స్టార్టర్‌ను ఎత్తికెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వాకాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ముట్టెంబాక మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం వారు దుర్గవరం, కల్లూరు, కోడివాక గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మస్తానయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధనతో పాటు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు.

కాళంగి నదిలో మృతదేహం

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కాళంగి వంతెన సమీపంలో నీటిలో మృతదేహం తేలియాడుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు గళ్ల లుంగీ, ఆకుపచ్చ టీ షర్టు ధరించి ఉన్నాడు. వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుంది. కాలకృత్యాలకు వెళ్లి నీటిలో పడిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీటీసీ మస్తానయ్య మృతి



మస్తానయ్య(ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, జూన్16(ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుర్రం మస్తానయ్య (70) మృతి చెందారు. దొరవారిసత్రం మండల గొల్లపాళెం గ్రామానికి చెందిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం ఇంటి వద్దనే తుదిశ్వాస విడిచారు. మస్తానయ్య భౌతికాయానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాళులర్పించారు. అలాగే వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు వేణుంబాక మునస్వామినాయుడు, బీసీ నేత జెట్టి వేణు తదితరులు నివాళులర్పించారు.




ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తవ్విన గుంతలో మురుగునీరు - గుంత పక్కనే ఓపెన్ జిమ్‌లో కసరత్తులు చేస్తున్న స్థానికులు

కసరత్తులు చేయాలంటే.. కంపు భరించాల్సిందే

హైస్కూల్ మైదానంలో జిమ్ పక్కనే మురుగునీరు

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కసరత్తు చేయాలంటే కంపు భరించాల్సింది వస్తోంది. మైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణంలోని ప్రజలు వాకింగ్ చేయడంతో పాటు అక్కడున్న ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తుంటారు. విశాలమైన మైదానంలో వాకింగ్ చేసేందుకు సౌకర్యంగా ఉండడమే కాకుండా జిమ్ కూడా ఉండడంతో మహిళలు, చిన్న పిల్లలు సైతం వచ్చి వ్యాయామం చేస్తుటారు. అయితే ఇక్కడ జిమ్ పక్కనే మురుగునీరు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది. 2018లో మైదానం దక్షిణ వైపు, ప్రస్తుతం ఉన్న జిమ్ పక్కన ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బేస్‌మట్టం వేసి అన్ని దిక్కుల పిల్లర్స్ వేశారు. దాదాపు 15శాతం మేర పనులు జరిగాయి. అనంతరం ప్రభుత్వం మారడంతో ఇండోర్ స్టేడియం పనులు అర్ధాంతంగా ఆగిపోయాయి. పిల్లర్స్ కోసం తవ్విన గుంతలు అలాగే ఉండడంతో వర్షం కురిసినప్పుడు నీళ్లు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పక్కనే ఉన్న ప్రహరీ బేస్‌మట్టం దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. పక్కనే జిమ్ ఉండడంతో ముక్కు



మైదానంలో వర్షపునీటి మధ్యలో వాకింగ్

మూసుకుని ప్రజలు వ్యాయామం చేస్తున్నారు. మురుగునీటికి తోడు రెండు రోజుల నుంచి సాయంత్రం వేళల్లో సూళ్లూరుపేటలో కురుస్తున్న వర్షానికి మైదానంలో నీరుచేరి చెరువును తలపిస్తోంది. సంబంధింత అధికారులు చొరవతీసుకుని హైస్కూల్ మైదానంలో వర్షపునీటితో పాటు జిమ్ పక్కన మురుగు నిల్వ చేరకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

తరగతుల విలీనాన్ని ఆపకుంటే ఉద్యమిస్తాం



తమ పాఠశాలలోనే ఉంటామంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని తరగతుల విలీనాన్ని తక్షణమే ఆపకుంటే ఉద్యమిస్తామని తల్లిదండ్రులు, విద్యార్థులు హెచ్చరించారు. సోమవారం కోట పట్టణ పరిధిలోని నార్త్ గిరిజన కాలనీ పాఠశాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనకాలనీ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను జరుగుమల్లి పాఠశాలలో విలీనం చేశారని, విద్యార్థులు అంతదూరం నడిచివెళ్లలేరని చెప్పారు. ఇక్కడి పాఠశాలను విడిచిపెట్టి పక్క గ్రామంలోనే ఉన్న పాఠశాలకు వెళ్లే ప్రసక్తే లేదన్నారు. స్థానిక ఉపాధ్యాయులు నచ్చచెప్పినా విద్యార్థుల తల్లిదండ్రులకు వినలేదు. ఇళ్ల వద్ద నుంచి భోజనాలు తెచ్చుకొని పాఠశాల ప్రాంగణంలోనే తిన్నారు. పొద్దుపోయేవరకు నిరసన తెలిపారు.

పాఠశాలను కొనసాగించండి

బాలాయపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అలిమిలి దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను అక్కడే కొనసాగించాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం విద్యా కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ కాలనీలోని పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నూరు ప్రాథమిక పాఠశాల పంపాల్సి వస్తోందన్నారు. దీనివల్ల పిల్లలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. అలిమిలి దళితవాడలోనే పాఠశాలను కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఏవోకి వినీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మూడేళ్ల నుంచి మూతే...!

పశువైద్య సేవలు అందక పాడి రైతుల అవస్థలు



మూతబడి ఉన్న పశు వైద్యశాల

దొరవారిసత్రం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మావిళ్లపాడులోని పశు వైద్యశాల మూడేళ్ల నుంచి మూతపడి ఉంది. మావిళ్లపాడుతో పాటు, తల్లంపాడు, తనియాలి, బుదూరు, ఉచ్చూరు ప్రాంతాలకు పశువైద్య సేవలు అందించాల్సిన ఈ ఆస్పత్రిలో మూడేళ్ల నుంచి వైద్యాధికారిని నియమించలేదు. ఉన్న సిబ్బంది ఆస్పత్రికి రాకపోవడంతో మూతబడిపోయింది. దీంతో పశువైద్య సేవల కోసం పాడిరైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మావిళ్లపాడు పశు వైద్యశాలకు డాక్టర్‌ను నియమించి వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి మీనాక్షి సుందరి

నాయుడుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే న్యాయవిజ్ఞాన సదస్సులో దరఖాస్తు చేసుకోవచ్చని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని సంజాయ్‌గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమాన్ని జడ్జి సందర్శించారు. సీనియర్ సిటిజన్ ప్రొటక్షన్ యాక్ట్ గురించి వివరించారు. వృద్ధుల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు తెలిపి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచుకృష్ణయ్య, న్యాయవాదులు చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకంపై అవగాహన

పెళ్లకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం అన్నదాత సుఖీభవ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాయుడుపేట సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకుడు నాగర్జునసాగర్ మాట్లాడుతూ పంటల సాగుతో ఖర్చులు తగ్గించి, అధిక ఆదాయం పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఎరువులు, పురుగుమందులు ఎంత మోతాదులో, ఏ సమయంలో వాడాలో రైతులకు తెలియజేయాలని, అలాగే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం పెళ్లకూరులో సాగులో ఉన్న వరిపైరును పరిశీలించారు. నల్లి నివారణకు 2 ఎంఎల్ ప్రొఫోనోఫాస్, ఓమైట్ పురుగు మందు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మూడో విడుత ఎరువులు వేసేటప్పుడు తప్పకుండా 20 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి విజయభారతి, వీఏఏ చందు, దినేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో ఉచిత ఆధార్ క్యాంపు



ఆధార్ క్యాంపులో గిరిజనులు, సచివాలయం సిబ్బంది

చిల్లకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శంకరన్ గిరిజన కాలనీలో సోమవారం ఉచిత ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు నెల్లూరు రామ్మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఉచిత ఆధార్ కార్డులను అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. వలసపోయిన కుటుంబాలకు, వారి పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, ఫోన్ నంబరు లింకు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది శాంతి, రఫీ పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించండి

వాకాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిపూడి పంచాయతీ రెడ్డిగారిదిబ్బ, నాయీబ్రాహ్మణకాలనీలో 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పది కుటుంబాలకు దారి సౌకర్యం లేకుండా చేస్తున్నారని నెలమల్లి సురేష్ ఆధ్వర్యంలో నెలిపూడి గ్రామస్తులు సోమవారం తహసీల్దారు రామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి దారికి అడ్డంగా సునీల్ కంచె వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలానికి చెందిన ముగ్గురు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి రూ.78,1900 మంజూరైంది. సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలువురు తమ సమ్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వాకాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినతోట సమీపంలో ఉన్న గిరిజన కాలనీకి చెందిన మైత్రి, చెంచయ్య దంపతులకు సోమవారం ఏఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. మైత్రి దంపతుల పూరిల్లు ఆదివారం దగ్ధమైంది. సోమవారం ఏఆర్‌డీ చైర్మన్ బషీర్ రూ.10వేలు, చిన్నతోట గ్రామానికి చెందిన మునిశేఖర్ రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్‌డీ సంస్థ ప్రతినిధులు రామాంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వెంకటగిరి ఎస్‌ఐగా మస్తానయ్య



వెంకటగిరి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్‌ఐగా మస్తానయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

విద్యాకిట్ల పంపిణీ

ఓజిలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పున్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లుతో కలసి ఎంఈవో చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు కిట్లు అందజేశారు.

హామీలను నెరవేర్చాలి

గూడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. సోమవారం స్థానిక సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా రూ.15వేలు అందజేస్తామని చెప్పి రూ.2వేలు కోత విధించడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది అవుతున్నా నిరుద్యోగ భృతి అందించలేదన్నారు. అలాగే 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని నేరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, సునీల్‌రెడ్డి, శారద, కోదండరామయ్య, వాసు, సుబ్బారావు, రాజేష్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

నాయుడుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కమిషనర్ ఫజులుల్లాకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు చెంగయ్య మాట్లాడుతూ జీవో నెంబరు 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాసరావుకు పరామర్శ



సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంచి కృష్ణయ్య, పక్కన పల్లా శ్రీనివాసరావు

పెళ్లకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పెళ్లకూరు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పరామర్శించారు. ఇటీవల పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే సింహాచలం మృతి చెందారు. సోమవారం విశాఖపట్టణంలోని ఆయన నివాసంలో సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమస్యలను పరిష్కరించండి

గూడూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలువురు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ భానుప్రకాష్‌రెడ్డికి వినతులు అందజేశారు.

కూరగాయల ప్రదర్శన

ఓజిలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను ప్రదర్శనకు ఉంచి విక్రయించారు. అన్ని రకాల కూరగాయలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించినట్లు నిర్వాహకులు ధనుంజయ, చెంచమ్మ, రాజేష్, రేవతి తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

వాకాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్ఎంయుఏ) కార్మికులు సోమవారం బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్మికుల పట్ల డిపో మేనేజర్ పెంచలయ్య పక్షపాతంలో వ్యవహరిస్తున్నారన్నారు. మరో యూనియన్‌కు అధిక ప్రాముఖ్యం ఇస్తూ మిగిలిన యూనియన్‌లను పట్టించుకోవడం లేదన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు